Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 16.12.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 28 పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# నలుపు తెలుపైపోయింది...

## పథకం తేలిపోయింది





- నివ్వెరపోయేలా బ్యాంకు జమలు
- కేంద్రం అంచనాలు పటాపంచలు
- బ్యాంకుల అక్రమాలతో ఆపరేషన్ ఫెయిల్
- రియల్ఎస్టేట్ ఢమాల్
- కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ
- సామాన్యుడి దీనావస్థ
- పెరుగుతున్న నిరుద్యోగం

ఏమిటిది?
దేశంలో ఏం జరుగుతోంది?
బ్లాక్‌మనీపై అనుకున్నదేమిటి?
ఇక్కడ జరుగుతున్నదేమిటి?
నల్లధనంపై మన అంచనాలేమయ్యాయి?
అసలు నల్లకుబేరులు ఎక్కడికిపోయారు?

**కేం**ద్రప్రభుత్వ పెద్దల్లో కలవరం మొదలైంది. నల్లధనం, అవినీతిపై యుద్ధమంటూ పెద్దనోట్లు రద్దు చేసిన కేంద్రంలో నిస్సత్తువ ఆవహించింది. రోజురోజుకూ బ్యాంకుల్లో జమపడుతున్న నోట్ల కట్టలు... సారీ... కరెన్సీ గుట్టలు చూసి కేంద్ర పెద్దలే కళ్ళు తేలేస్తున్నారు. వాళ్లు అనుకున్నదొకటైతే ఇక్కడ జరుగుతున్నదొకటి. పెద్దనోట్ల రద్దు తర్వాత ఫలితాలపై పెట్టుకున్న కలలు కరిగిపోతున్నాయి. డిసెంబర్ 30 తర్వాత ప్రజలకు ఏం చేయాలో, వారిలోని ఆవేశాన్ని ఏ విధంగా తగ్గించాలో తెలియని అయోమయ స్థితికి కేంద్రంలోనవుతోంది.

డిసెంబర్ 10వ తేదీ నాటికే 12.44లక్షల కోట్ల పాత నోట్లు దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో జమపడినట్లు ఆర్‌బిఐ పేర్కొంది. దేశంలో మొత్తం చెలామణిలో వున్న పెద్దనోట్లే 14.60లక్షల కోట్లు. బ్యాంకుల్లో పెద్దనోట్ల జమకు ఇంకా రెండువారాల గడువుంది. టైం దగ్గరపడే కొద్ది మార్కెట్‌లో వున్న మిగతా పెద్దనోట్లు కూడా బ్యాంకులకు చేరడం ఖాయం. ఈ లెక్కన చూస్తే ప్రభుత్వం అంచనా తప్పడం ఖాయమనిపిస్తోంది. ప్రభుత్వం మూడు నుండి (మిగతా 11వ పేజీలో)



## ఎవరీ శేఖరుడు

- బినామీనా... సునామీనా? 11లో



# కలిసుందాం...రా!

- జగన్‌కు కాంగ్రెస్ స్నేహహస్తం
- ఆచితూచి అడుగేస్తున్న వైకాపా


***ఆం**ధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు కాంగ్రెస్‌పార్టీ అంటే కింగ్! తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించక ముందు ఈ రాష్ట్రాన్ని ఎక్కువ కాలం ఏలింది కాంగ్రెస్సే! అలాంటి పార్టీని ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో అంటరానిదిగా చూస్తున్నారు. ఆ పార్టీ పేరు వింటేనే ఆంధ్రా ప్రజలు అసహ్యించుకుంటున్నారు. అందుకు వేరే కారణం ఏమీ లేదు. అత్యంత దరిద్రంగా, ఆంధ్రుల కడుపు మండిస్తూ చేసిన రాష్ట్ర విభజనే! ఆ పార్టీని ఆంధ్రా ప్రజలు ఎంత నీచంగా చూస్తున్నారన్న విషయాన్ని 2014 ఎన్నికలే స్పష్టం చేశాయి. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు దాదాపు సమాధి కట్టిన పరిస్థితులు వచ్చాయి.*

ఈ రాష్ట్రంలో ఇక కాంగ్రెస్ కోలుకోదు అనుకున్న తరుణంలో పెద్దనోట్ల రద్దు అంశం ఊపిరిపోయే వ్యక్తికి వెంటిలేటర్ తగిలించినట్లుగా అయ్యింది. పెద్దనోట్ల రద్దుపై రాష్ట్రంలో ప్రతిపక్ష వైకాపా కంటే ఎక్కువ రాద్ధాంతం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయే! చిల్లర దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనో లేక పెద్దనోట్లు మార్చుకోలేక తాము ఇబ్బందులు పడుతుండడం వల్లనో ఏమోగాని ఆ పార్టీ వాళ్లే రాష్ట్రంలో బాగా ఆందోళనలు చేస్తున్నారు.

పెద్దనోట్ల రద్దుపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, విభజన తాలూకు అన్యాయం ప్రజలు మరచిపోవడంతో ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ నాయకులకు ఎక్కడలేని హుషారొచ్చింది. కేంద్రంలో బీజేపీకి రాష్ట్రంలో టీడీపీకి వ్యతిరేకంగా ఇక గట్టిగా పోరాడాలనుకుంటున్నారు. అయితే రాష్ట్రంలో ఒంటరి (మిగతా 11వ పేజీలో)



## మూడు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు



బొల్లినేని కోటేశ్వరరావు గూడూరు | కందే రమణయ్య రాపూరు | గండవరం రజనమ్మ వాకాడు

జిల్లాలోని గూడూరు, రాపూరు, వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్‌గా గూడూరు మండల టీడీపీ అధ్యక్షులు బొల్లినేని కోటేశ్వరరావును, వైస్‌ఛైర్మెన్‌గా ఆర్యవైశ్య వర్గాలకు చెందిన సోమిశెట్టి చెంచురామయ్యను నియమించారు. అలాగే రాపూరు కమిటీ ఛైర్మెన్‌గా టీడీపీ నాయకులు రాపూరు మండలం గోనెపల్లికి చెందిన కందే రమణయ్యను, వైస్‌ఛైర్మెన్‌గా పొదలకూరు మండలం కళ్యాణపురంకు చెందిన అక్కెం బుజ్జిరెడ్డిని నియమించారు. వాకాడు కమిటీ ఛైర్మెన్‌గా కోట మండలం తిన్నెలపూడి ఎంపీటీసీ గండవరం రజనమ్మను, వైస్‌ఛైర్మెన్‌గా వాకాడు మండలం నిడిగుర్తికి చెందిన దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ప్రతి కమిటీలోనూ 17మందిని సభ్యులుగా నియమించారు.

గూడూరు నియోజకవర్గ పరిధిలోని ఈ మూడు మార్కెటింగ్ కమిటీ పాలకవర్గ నియామకాలలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాటే చెల్లుబాటయినట్లుగా తెలుస్తోంది. మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌కు గాని, మొన్నటివరకు గూడూరు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన డాక్టర్ బి.జ్యోత్స్నలతకు గాని మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకాలలో పెద్దగా ప్రాధాన్యతనిచ్చినట్లు లేదు.

## జాతీయ రెజ్లింగ్ పోటీలకు నెల్లూరీయులు

విశాఖపట్నంలో మూడురోజులుగా జరిగిన మూడవ రాష్ట్ర స్థాయి అమెచ్యూర్ రెజ్లింగ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరు క్రీడాకారులు విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని నెల్లూరుజిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉదయకుమార్ తెలిపారు.

విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు జరిగిన 66కిలోల విభాగంలో ఫ్రీ స్టయిల్ కేటగిరీలో పాల్గొన్న రాజేష్ స్వర్ణ పతకం, బాలికల విభాగంలో బిందుప్రియ 51కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.

# రిలయన్స్ భూములపై పోరాటం చేస్తాం


### - సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి




రిలయన్స్ భూములపై రాజకీయాలకు అతీతంగా చేస్తున్న పోరాటానికి అందరూ కలసికట్టుగా రావాలని సర్వేపల్లి ఎమ్మెల్యే, వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరులోని సిపిఎం, సిపిఐ కార్యాలయాల్లో కమ్యూనిస్టు నాయకులను కలిసి పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్ కోసం రైతుల నుంచి 2,700 ఎకరాల భూములను సేకరించడం జరిగిందన్నారు. భూసేకరణ సమయంలో ఇంటికో ఉద్యోగం కల్పించి భూములు కోల్పోయిన పేదరైతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. భూములు సేకరించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఇటీవల సిఎం చంద్రబాబు ముత్తుకూరు పర్యటనలో రిలయన్స్ థర్మల్ ప్రాజెక్ట్ సాధ్యంకాదని చెప్పారని, భూములు లేక ఉద్యోగాలు రాక రైతుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఎక్కడైనా రైతుల వద్ద నుంచి సేకరించిన భూముల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయకపోతే తిరిగి రైతులకు ఇచ్చే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల జి.ఓ నెంబర్ 57ను జారీ చేసిందన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగాలు కల్పిస్తూ మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. రిలయన్స్ భూములపై రాజకీయాలకు అతీతంగా ఐక్యకార్యాచరణ ఏర్పాటు చేసి రైతు కుటుంబాలను ఆదుకునేందుకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య మాట్లాడుతూ రిలయన్స్ భూములు తిరిగి రైతులకు ఇప్పించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు పోదామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, సిపిఐ సీనియర్ నాయకులు పముజుల దశరథరామయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పార్థసారధి మాట్లాడుతూ కాకాణి చేస్తున్న పోరాటానికి ప్రతిఒక్కరం అండగా వుంటామన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపీ జడ్పీటీసీ సభ్యులు వెంకటశేషయ్య, చిరంజీవి, విష్ణువర్ధన్‌రెడ్డి, కమ్యూనిస్టు పార్టీ నాయకులు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు

గూడూరు పట్టణం పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని పేదలకు సోమవారం దుప్పట్లును పంపిణీ చేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సోమిశెట్టి చెంచురామయ్య ఆధ్వర్యంలో స్థానిక జివిఎస్ఆర్ కళ్యాణ మండపంలో దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ప్రసాదు, రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# కాలాన్ని గెలిచిన కలం సూర్యుడు.. రావి రంగారావు

- **18న డా.నాగభైరవ అవార్డు ప్రదానం**

"కవిత్వం కోసం కవిత్వం రాసే దారి కాదు నాది. మనిషి కోసం మనిషిగా బతకాలనే తత్వం నాది"... అంటున్న రావి రంగారావు నిరంతర కవి. నిత్య బోధకుడు. ఏది కవిత్వమో తెలిసి రాస్తున్న కవి. ఐదు దశాబ్దాలుగా కవిత్వాన్ని శ్వాసిస్తూ, వేదికలపై ఉపన్యసిస్తూ, తరగతి గదిలో బోధిస్తూ, అలుపు లేకుండా ప్రవహిస్తున్న కవి. కవిత్వాన్ని జడపదార్థంగా గాక, గుండెను తట్టి లేపే పాలికేకగా, మనిషి కోసం రాస్తున్న కవి.

డాక్టర్ రావి రంగారావు తొలి నాళ్లలో పద్యాన్ని సేద్యం చేశారు. గుండె పొదిలో 'అమృతవృక్షాన్ని' నాటారు. పంటలు పండించారు. రుచికరమైన ఫలాలు అందించారు. అయితే, గణాలు, గుణాలు, యతిప్రాసల చట్రంలో ఇరికించి, పాఠకుణ్ణి ఇబ్బందిపెట్టడం కంటే భావాన్ని సూటిగా చెప్పే వచన కవితా మార్గానికి ఓటేశారు. కుందుర్తి వచన కవితా మార్గాన్ని, తనదైన పద్ధతిలో, శైలిలో, అభివ్యక్తిలో మరింత విస్తరించి తమ రచనలతో దానికో ఉద్యమస్ఫూర్తిని, చైతన్యశీలతను తెచ్చిన కవి.

**'చెప్పాల్సింది చెప్పకపోతే**
**నాలుక కాదు**
**రాయాల్సింది రాయకపోతే**
**కలం కాదు**
**చూడాల్సింది చూడకపోతే**
**కళ్ళు కావు**
**అవి ఉరిమి లేచే నిప్పురవ్వలు కావాలి'...**

అంటున్న రావి రంగారావు కవులేం చేయాలో స్పష్టం చేశారు. కవిత్వమంటే అక్షరాల కూర్పు, మాటల పేర్పు కాదు. అంత్యప్రాసల గారడీ అంతకన్నా కాదు. కవిత్వం వర్తమానానికి ప్రాణం. భవిష్యత్తులోకి ప్రయాణం. చూడాల్సినదాన్ని చూసి, చెప్పాల్సినదాన్ని చెబితే కవిత్వం కాలాన్ని జయించే మహాశక్తి అవుతుంది. ప్రజలకు దిశానిర్దేశం చేస్తుంది. నాటి నన్నయ్య నుంచి నేటి నారాయణరావు దాకా కవిత్వం కాలం వెంట నడుస్తూనే వుంది. కర్తవ్యాన్ని బోధిస్తూనే వుంది.

రావి రంగారావుకు ప్రయోగం, ప్రయోజనం రెండుకళ్లు. వచన కవిత్వంలో సరికొత్త ప్రయోగాలు చేస్తూనే ప్రజాప్రయోజనమే ధ్యేయంగా రంగారావు కలం కదిలించారు. కవికి వున్న సామాజిక బాధ్యత, సిద్ధాంత బలం రెండూ తెలిసి, ప్రజల పక్షాన నిలబడి, కాల స్పృహతో రచనలు చేశారు. ముఖ్యంగా వచన కవిత్వంలో సంక్షిప్తతకు సృష్టి చెప్పి, పొడిపొడి మాటల్లో వాక్యాన్ని పదునెక్కించి, వచన కవిత్వం ఎందుకు గొప్పదో నిరూపించారు. రంగారావు కవిత్వంలో పులుముడు వుండదు. సందిగ్ధత వుండదు. పాఠకులతో నేరుగా మాట్లాడే దాపరికం లేని భాష వారిది. రంగారావు రాసిన గుడ్‌మార్నింగ్, ముఖం పుల్ల, రెజర్‌లో సూర్యుడు, అగ్గిపెట్టె, తెల్లచీకటి, సూర్యుళ్ళ గెలుపు, గుండెదీపాలు, సూర్యరసం వంటి కవితా సంపుటాలు అచ్చమైన వచన కవిత్వానికి ఆనవాళ్ళు. రంగారావు వ్యక్తిత్వం వారి కవిత్వంలో ప్రతిబింబిస్తుంది. రంగారావు అవినీతిని వ్యతిరేకించారు. దోపిడీని ప్రశ్నించారు. దౌర్జన్యాన్ని నిరసించారు. సమాజంలో పేరుకుపోయిన కుళ్ళును, మురికిని 'కుంకుడుకాయ' రసంతో కడిగారు. వాగ్దానాల్ని వాంతి చేసుకునే నాయకులు, మతఛాందసులు, కుల వాదులు, 'నల్లబకాసురుల వల్ల సమాజం బాగుపడదని, ప్రజలు మేలుకొంటేనే ప్రగతి సాధ్యమని విశ్వసించి అందుకు కవిత్వాన్ని సాధనంగా చేసుకున్నారు.

**'పదును పెట్టుకుని ప్రయోగించగలిగితే**
**మాటకు మించిన**
**శస్త్రాలుంటాయా?'...**

అంటూ కవిత్వాన్ని 'అగ్గిపుల్ల'లా వెలిగించారు. 'సూర్యుళ్ళ గెలుపు'కు కవిత్వం మార్గమవుతుందన్నారు. 'నా కవిత్వం వావిలాల గోపాలకృష్ణయ్య లాంటిద'న్నారు. కవి నైతిక విలువలకు పట్టం కట్టాలన్నారు. నీతి, నిజాయితీ, నిర్భీతి, నిబద్ధత కవికి ఊపిరి కావాలన్నారు.

కవికి వస్తుదృష్టితో పాటు భవిష్యదృష్టి కూడా వుండాలి. కవిత్వం సమకాలీన ప్రయోజనాన్ని నెరవేరుస్తూనే సార్వకాలిక సందేశం ఇవ్వాలి.

**'సముద్రం**
**దేశంలోని అవినీతి కన్నా చిన్నది'..**

అని దశాబ్దం క్రితమే చెప్పిన రంగారావు చెప్పిన మాటలు, ఇవ్వాళ నరేంద్ర మోడీ 'నల్లధనం' పై చేస్తున్న యుద్ధానికి ప్రాతిపదికలు. "డబ్బు దేవుడయ్యేసరికి.. ఇనుము పెట్టయింది. రాయి గోడయింది. చెక్క తలుపయింది. చివరకు ప్రాణం కుక్కయింది"..అని ఏనాడో మానవుడి డబ్బుజబ్బుకు భాష్యం చెప్పారు రంగరావుగారు.

1980 ప్రాంతాల్లో మినీకవిత్వాన్ని భుజానకెత్తుకుని, ఊరూరా తిరిగి, ఉద్యమంగా యువ కలాల్ని, గళాల్ని వెలిగించిన రావి రంగారావు మినీ కవితా ఉద్యమానికి కర్త, కర్మ, క్రియ అన్నీ తానై, 'మినీ కవితా పితామహుడి'గా నిలిచారు. అద్దేపల్లి, అలిశెట్టి ప్రభాకర్, కొల్లూరి, పూర్ణచంద్ లాంటివాళ్ళు మినీ కవిత్వమనే 'తాజ్‌మహల్'కు రాళ్ళెత్తి రంగులద్దిన శిల్పులు. మినీ కవిత్వం 'అగ్గిపుల్ల'లా వెలిగి ఆరిపోయినా, దాని కాంతుల్ని వేయి చేతుల్తో 'వేయినూట పదహార్లు'గా విస్తరించి, ఇరుసులా నిలిచారు రంగారావుగారు.

రంగారావుగారు మంచి కవి కావడం వల్లనే మంచి టీచరయ్యారు. మచిలీపట్నం కార్యక్షేత్రంగా, మూడున్నర దశాబ్దాలు ఆంధ్ర జాతీయ బిఇడి కాలేజీలో లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా వేలాదిమంది టీచర్లను తయారుచేశారు. వాళ్ళకు కవిత్వంలో మెళకువలు నేర్పారు. రచనల్లో నైపుణ్యాలను వివరించారు. 'వర్క్‌షాప్'లు నిర్వహించారు. 'సాహితీ మిత్రులు' సంస్థను స్థాపించారు. పాతికేళ్లకు పైగా దానికి ప్రాణవాయువుగా నిలిచారు. అవార్డులు నెలకొల్పారు. కొత్త కలాల్ని భుజం తట్టారు. ఇంటిని కవిత్వ కర్మాగారంగా మార్చారు. కుటుంబం కంటే కవిత్వాన్నే ఎక్కువగా ప్రేమించారు.

**'కాలం కన్నా మాట గొప్పది**
**ఆ మాటలోని మనసు గొప్పది**
**ఆ మనసులోని తపన గొప్పది'**

–అని తనను తానే 'ప్రాజెక్ట్' చేసుకున్న కార్యాచరణ కవి రంగారావు. అదును, పదును తెలిసి కవిత్వం రాస్తూ, తాను నడుస్తున్న దారి వెంట చైతన్యపు పరిమళాన్ని వెదజల్లుతూ, కవిత్వమై వెలుగుతూ, కాలాన్ని వెలిగిస్తూ, కలంతో కాలాన్ని జయించిన 'కలం సూర్యుడు' రావి రంగారావుగారు. రంగారావుగారిని 2016వ సంవత్సరపు ప్రతిష్టాకరమైన డా. నాగభైరవ కవితా పురస్కారంతో సత్కరించడం ద్వారా నెల్లూరు నాగభైరవ అవార్డు కమిటీవారు అక్షరానికి విలువ పెంచారు. నాగభైరవ గారికి గుర్తింపు తెచ్చారు.

నిలువెత్తు నిరాడంబర కవి డా. రావి రంగారావుకు మన:పూర్వక శుభాకాంక్షలు.

**(ఈ నెల 18వ తేదీ ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో ప్రఖ్యాత కవి డా. రావి రంగా రావుకు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'డా. నాగభైరవ అవార్డును' ప్రదానం చేస్తున్న సందర్భంగా..)**




**- డా. బీరం సుందరరావు**
**ఇంకొల్లు-523167**
**ఫోన్: 9848039080**

# నెల్లూరీయుల అభిమానానికి వెల కట్టలేను

## - దుబాయ్‌లో సింహపురీయన్స్ మీట్ అండ్ గ్రీట్‌లో ఎస్పీ బాలు







తాను ఎక్కడకు వెళ్లినా ఏ దేశమేగినా నువ్వు మా వాడివి అంటూ నెల్లూరీయులు చూపిస్తున్న ఆదరాభిమానాలకు వెల కట్టలేనని ప్రముఖ సినీ నేపథ్యగాయకులు, పద్మభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని నెల్లూరీయులంతా కలిసి ఒకే వేదికపైకొచ్చి ప్రతి మూడు నెలలకోసారి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించుకుంటున్నారు. ఈ సమావేశాలకు నెల్లూరుజిల్లాకే చెందిన వివిధ రంగాల నిపుణులను అతిథులుగా ఆహ్వానిస్తూ, వారితో కలిసి ఒక రోజంతా ఆత్మీయంగా గడుపుతారు. ఈ నెల 10వ తేదీన దుబాయ్‌లోని క్రౌన్‌ప్లాజా హోటల్‌లో జరిగిన సింహపురీయన్స్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి ఎస్పీ బాలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాను ఎక్కడికి వెళ్లినా నెల్లూరీయుల నుండి వస్తున్న స్పందనను వారితో పంచుకున్నారు. ఏ దేశమేగినా, ఎందుకాలిడినా మీ మాతృభూమిని మరువ వద్దంటూ సింహపురీయన్స్‌కు బోధించారు. జీవితంలో ధనమే ముఖ్యం కాదని, అంతకన్నా అభిమానం, వ్యక్తిత్వ విలువలు ముఖ్యమని చెప్పారు. దేశం కాని దేశంకు వచ్చి కష్టపడుతున్న మీరందరు కూడా ఉన్నత స్థాయిలకెదిగి మిమ్మల్ని కన్నవాళ్లకు పుట్టిన ఊరికి పెంచిన దేశానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. సినీ పరిశ్రమలో మొదటి పాట పాడి 50ఏళ్లయిన సందర్భంగా ఎస్పీ బాలును సింహపురీయన్స్ పక్షాన శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కుటుంబాలతో సహా తరలి వచ్చిన సింహపురీయన్స్ బాలుతో కలిసి విందులో పాల్గొన్నారు.



ఈ కార్యక్రమంలో యూఏఇ సింహపురీయన్స్ దువ్వూరు కిషోర్‌బాబు, గంగపట్నం ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వూడి విజయ కుమార్, గాజుల కిరణ్‌కుమార్‌రెడ్డి, చిన్ని యశోవర్ధన్, ఎరికి తులసిప్రసాద్, కొండా వెంకట సింధు, చిలకపాటి వెంకట లక్ష్మీ సింధూర, శ్రీధర్‌రెడ్డి, శివకుమార్, సాయి ప్రకాష్, శరత్‌చంద్ర, మురళిరెడ్డి, డా॥ సాగరేశ్వర్, ఫాజల్, భాను ప్రకాష్‌రెడ్డి, సందీప్, సందేశ్ మల్లి ఖార్జునరెడ్డి, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 18న డా. నాగభైరవ అవార్డు పండుగ

ప్రఖ్యాత కవి, దివంగత డా. నాగభైరవ కోటేశ్వరరావు స్మారకార్థం నెల్లూరులోని డా. నాగభైరవ అవార్డు కమిటీ వారు ఈ నెల 18వతేది (ఆదివారం) సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో డా. నాగభైరవ 8వ జాతీయ అవార్డు పండుగను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి డా. రావి రంగారావుకు ఎంతో ప్రతిష్టాత్మకమైన డా. నాగభైరవ అవార్డును బహుకరిస్తున్నామని, శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ చేతులమీదుగా ఈ అవార్డు ప్రదానం వుంటుందని అవార్డు కమిటీ ప్రధానకార్యదర్శి చిన్ని నారాయణరావు తెలిపారు. ప్రముఖ సినీకవి వెన్నెలకంటి అధ్యక్షత వహించే ఈ సభకు తొలుత 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి జ్యోతిప్రకాశనం చేస్తారని, ఈ సభకు ప్రముఖ సినీనటుడు కృష్ణభగవాన్, రాజధాని నిర్మాణ సలహాకమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావు ప్రత్యేక అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. విశిష్ట అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కిలారి వెంకటస్వామినాయుడు, కావలి మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్, మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జివి పూర్ణచందు, ప్రముఖ కవి పొట్లూరి హరికృష్ణ (హైదరాబాద్), డా.నాగభైరవ మనుమడు కూకట్ల రాఘవేంద్ర ఈ అవార్డు పండుగలో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ వేదికపై డా.నాగభైరవ అధ్యాపక అవార్డును ప్రముఖ రచయిత



మండలి బుద్ధప్రసాద్



కృష్ణ భగవాన్

పచ్చిపులుసు వెంకటేశ్వర్లుకు ప్రదానం చేస్తామన్నారు. అదేవిధంగా, 2016 సంవత్సరానికి డా.నాగభైరవ స్ఫూర్తి అవార్డులను ప్రముఖ కవులు మద్దూరు శ్రీనివాసులు, ఈతకోట సుబ్బారావు, కాసుల నాగభూషణం, కె. విల్సన్‌రావు, శ్రీమతి జ్యోతిష్మతిలకు ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు సమన్వయకర్తగా ప్రముఖ కవి బీరం సుందరరావు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ వేడుకలో భాగంగా 'కళాంజలి' అనంత్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి వుంటుందని ఆయన తెలిపారు. డా. నాగభైరవ అవార్డు పండుగలో కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు, సాహితీవేత్తలు, నాగభైరవ అభిమానులు ప్రజలందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.



ఈ నెల 15వ తేదీన తన క్యాంపు కార్యాలయంలో ఫ్లెమింగో ఫెస్టివల్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పక్కన మంత్రులు పి.నారాయణ, సిద్ధా రాఘవరావు, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, మాజీఎమ్మెల్యే పరసా రత్నం

# నెల్లూరు కంపుకొడుతోంది

## - ఎమ్మెల్యే అనిల్ ధ్వజం



నెల్లూరు నగరంలో కార్పొరేషన్‌వారు పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో పూర్తిగా విఫలమవడంతో నగరంలో ఎక్కడ చూసినా పరిస్థితి అధ్వాన్నంగా వుందని, పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగిపొర్లి నగరం కంపుకొడుతోందని నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ ధ్వజమెత్తారు. గడప గడపకూ వైఎస్సార్సీపి కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం 51వ డివిజన్‌లోని కపాడిపాళెం ప్రాంతంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కపాడిపాళెంలో పారిశుద్ధ్యం పరిస్థితి దయనీయంగా వుందన్నారు. అక్కడక్కడా వీధిలైట్లు కూడా వెలగడం లేదన్నారు, ప్రజల నుంచి పన్నులు వసూలుచేసేందుకు కార్పొరేషన్‌వారు చూపుతున్న శ్రద్ధ, ప్రజల అవసరాలు తీర్చడంలో మాత్రం చూపడం లేదని ఆయన కార్పొరేషన్ అధికారుల తీరును దుయ్యబట్టారు. ఈ నెలలో క్రిస్మస్ పర్వదినం వస్తోందని, క్రైస్తవ సోదరులు వున్న ప్రాంతాల్లోను, ప్రార్థనామందిరాల వద్ద పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకు కార్పొరేషన్ అధికారులు వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నాయకులు ఏ.బాలప్రసాద్, అరవ ఆనంద్‌బాబు, కాయల సురేష్‌బాబు, ఏ.కల్పన, సంతోషిరమేష్, ఏ. ఆంథోనిబాబు, ప్రమీల, సరిత, వందన్, దార్ల వెంకటేశ్వర్లు, వందవాశి రంగ, సురేష్‌బాబు పాల్గొన్నారు.

# నగదు రహిత సమాజమే లక్ష్యం

## - ఇంతియాజ్ అహ్మద్



నగదు రహిత లావాదేవీలతోనే ఆర్థిక భద్రత ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం బుచ్చి మండలం కట్టుబడిపాలెం గ్రామంలో నిర్వహించిన నగదు రహిత లావాదేవీల అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీల ప్రయోజనాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ సదస్సులో బుచ్చి తహశీల్దార్, ఎంపిడిఓ, సర్పంచ్, సిండికేట్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

**'డిజిటల్ ఇండియా'**...ఇక రానున్నది ఇదే. ఇప్పటికే అది ప్రారంభమై క్రమేణా వ్యవస్థీకృత మవుతోంది. భారత్ భవితకు బంగరుబాటలు వేసే లక్ష్యంతో ముందుకు వస్తున్న ఈ ఆర్థిక వ్యవస్థ ఇక రానున్న రోజుల్లో మరింత బలీయమై, అవినీతికి..అక్రమాలకు అంటకత్తెర వేస్తూ..అచ్ఛమైన స్వచ్ఛపాలనకు దారులు తీస్తుంది. ఈ పుణ్యమంతా మోడీ సర్కారుదే. ఇన్నాళ్లూ దేశంలో అంతులేని కుంభకోణాలతో, అక్రమార్జనలతో, అవినీతితో కుళ్ళిపోయిన వ్యవస్థను కూకటివేళ్ళతో సహా పెకలించివేసి సుదృఢమైన సుపరిపాలన వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. పెద్దనోట్ల రద్దుతో అవినీతి అక్రమార్జనలకు అడ్డుకట్ట పడుతోంది. బడాబాబులు వందలు, వేల, లక్షల కోట్ల రూపాయలను అక్రమంగా వెనకేసుకున్న వైనాన్ని పెద్దనోట్ల రద్దు నిర్ణయం బట్టబయలుచేస్తోంది. సామాన్య ప్రజలు, కష్టజీవులు నిత్యదరిద్రంతో బాధలు పడుతూ వుంటే, 'నల్ల' దొరలు మాత్రం కోటానుకోట్లుగా నల్లధనాన్ని భోషాణాల్లో దాచుకుని వుండడం, మరోవైపు ఉగ్రవాదుల దుష్కృత్యాలకు.. నకిలీనోట్ల చెలామణికి అంతూపొంతూ లేకుండా వుండడం..వగైరాలన్నిటికీ ఒకే ఒక విరుగుడు మందు.. పెద్దనోట్ల రద్దు. దీంతో అవినీతి మూలాలు కదల బారుతున్నాయి. అక్రమార్జనపరుల గుండెలు బెంబేలెత్తుతున్నాయి. అటు బ్యాంకుల్లో అంతపెద్ద మొత్తాలు వేసుకోలేక, ఇటు ఇళ్ళలో అంతంత డబ్బు దాచుకోలేక అక్రమార్కులు పడే అవస్తలు అన్నిన్ని కావు. నల్లడబ్బును తెల్లగా మార్చుకోవాలని రక రకాల యత్నాలు చేసేవారూ దొరికిపోక తప్పని స్థితి వచ్చేసింది. ఇప్పటికే ఎంతోమంది దొరికి పోతున్నారు కూడా.

ఏదేమైనప్పటికీ, పెద్దనోట్ల రద్దుతో దేశంలో ఒక కొత్త మార్పుకు శ్రీకారం చుట్టడం జరిగింది. అందుకు కంకణం కట్టుకున్న ప్రధాని మోడీని, మోడీ సర్కారును ఎంతైనా అభినందించక తప్పదు. ఈ మార్పు భారతావనిలో మరిన్ని సరికొత్త మార్పులకు దారితీస్తుందని చెప్పక తప్పదు. పెద్దనోట్ల రద్దుతో చిల్లర దొరక్క ప్రజలు ఇప్పుడు పడుతున్న ఇబ్బందులు ఇంకెన్నో రోజులు వుండవు.. త్వరలోనే ఆ కష్టాలు మటుమాయం కానున్నాయి. అయినా, ఇంతపెద్ద దేశంలో ఒక కొత్త వ్యవస్థ.. అందులోనూ పెనురాకాసిలా వున్న అవినీతిని నిర్మూలిస్తూ..ఒక స్వచ్ఛమైన ఆర్థిక వ్యవస్థ...ఆవిర్భావం జరగాలంటే ఎన్నో సమస్యలు తప్పవు. వాటిని కష్టమోనిష్టమో కొద్దికాలం భరాయించక తప్పదు. కొద్దిరోజులు కష్టపడినా ఇక భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ వుండవు. అందులోనూ అవినీతిరహిత విధానాలకు, బస్తాలకొద్దీవున్న నల్లడబ్బు పీచమణిచేందుకు చేస్తున్న ఈ బృహత్ యజ్ఞంలో మనమూ ఒకరం కావడం..రానున్న పవిత్రభారత్‌కు మనవంతు సహకరించగలగడం నిజంగా ఒక అదృష్టమేననుకోవాలి. ఎప్పటికైనా సరే మార్పు అనివార్యం. ఇప్పుడు జరుగుతున్న ఈ మార్పు భారత్ భవితను మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే పెద్దనోట్ల రద్దు తర్వాత డిజిటల్ చెల్లింపు మార్గాలు ప్రజలకు బాగా దగ్గరవుతున్నాయి. జేబులో నోట్లకట్టలు పెట్టుకుని బజారుకువెళ్ళే రోజులు క్రమంగా కనుమరుగై పోతున్నాయి. ఓ చిన్నకార్డు జేబులోవుంటే చాలు మన డబ్బంతా మన జేబులో వున్నట్లే. కార్డు గీకితే చాలు, ఏ వస్తువు కావాలో అది ఇక వచ్చేసినట్లే. డిజిటల్ విధానం అంటే అదే. భారత్ ఇన్నాళ్ళకి..ఇన్నేళ్ళకి ఒక నూతన సాంకేతిక పరిజ్ఞానపు ఒరవడితో..డిజిటల్ విజ్ఞానంతో ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. ఇక అందరూ పాతకాలపు పద్ధతులు మాని, కొత్త పద్ధతులతో, అధునాతన సాంకేతిక పద్ధతులతో..విజ్ఞతతో డిజిటల్ ద్వారాలు తెరవాల్సి వుంది. ఎంతో శ్రేయస్కరమైన నగదురహిత లావాదేవీలకు సంసిద్ధం కావాల్సివుంది. అందుకు బాసటగా వున్న ప్రభుత్వంతో సహకరించి, డిజిటల్ విప్లవానికి బాటలు వేసుకోవాల్సి వుంది. ఎన్నో దేశాలు డిజిటల్ విధానాలతో, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పటికే అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతున్నాయి. ఈ మార్పు మనకూ ఇక అనివార్యం. లేకుంటే వెనుక బడిపోవడం ఖాయం. డిజిటల్ లావాదేవీ పద్ధతులతో, నగదు రహిత విధానాలతో, దేశాన్ని ఎంతగా నగదు రహితం చేస్తే అంతగా స్వచ్ఛమైన ఆర్థికవ్యవస్థ ఆవిర్భవిస్తుందన్న గట్టి విశ్వాసంతో ప్రధాని మోడీ వేసిన ఈ పునాదులే..రేపటి డిజిటల్ ఇండియాకు మార్గాన్ని సుగమం చేయనున్నాయి. అవినీతి, అక్రమార్జనలను నిరోధించి, నానాటికీ అస్తవ్యస్తంగా మారుతున్న ఆర్థికవ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళనం చేస్తే తప్ప అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేం. అందుకే ఆధార్ అనుసంధానంతో, సెల్‌ఫోనే ఒక బ్యాంక్‌గా అవతరించి, మన డబ్బుకు ఎలాంటి ధోకా లేకుండా కొనుగోళ్ళు చెల్లింపులు చేసుకునే విధానానికి దేశ వ్యాప్తంగా ప్రజలనుంచి వూహించని ఆదరణ పెరుగు తోంది. అవినీతి అక్రమాలకు తావులేకుండా..ఇక ఈ-వాలెట్లు, రూపే కార్డ్‌లు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు, ప్రీపెయిడ్ కార్డులతో ప్రజలంతా నగదు రహితంగా డిజిటల్ చెల్లింపులు జోరందుకోబోతున్నాయి. గ్రామగ్రామానా విస్తరించిన మొబైల్ ఫోన్స్ అవినీతిక్షాళన మహోద్యమానికి ఎంతో ఉపకరిస్తున్నాయి. డిజిటల్ యంత్రమే..ఒక మంత్రంగా మారుమ్రోగనుంది. మొబైల్ ఫోన్ల ద్వారా జరిగే నగదు రహిత లావాదేవీలతో దేశంలో ఎంతో శ్రేయస్కరమైన..అవినీతిరహితమైన ఆర్థికవ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. ఇదే భవిష్యత్తులో.. ప్రజలందరూ కలలు కన్న శ్రేయోరాజ్యంగా ఆవిష్కృతమవుతుంది. ప్రతి వస్తువునూ ఇక డిజిటల్ పద్ధతి ద్వారా ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేసేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్న బృహత్‌యత్నం అత్యంత త్వరలోనే దేశమంతటా సాకారం కానుంది.

అవినీతిని రూపుమాపే డిజిటల్ యంత్రాంగం పూర్తిస్థాయిలో అందరికీ అందుబాటులోకి వస్తే..సమస్త జనుల సంక్షేమం దానంతటదే అందుబాటులోకి వస్తుంది. ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది. అందుకు అన్నివిధాలా బాటలు వేస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి, భారత సర్కారుకు అభినందనలు!

### డిజిటల్ ఇండియా



**ఇది.. డిజిటల్ యుగం. దేశం లోనూ డిజిటల్ ఆర్థికవిప్లవం ఉరకలు వేస్తోంది. డిజిటల్ లావాదేవీలు.. అధునాతన సాంకేతిక పద్ధతులతో, నగదు రహిత విధానాలతో, దేశాన్ని ఎంతగా నగదు రహితం చేస్తే అంతగా స్వచ్ఛమైన ఆర్థికవ్యవస్థ ఆవిర్భవిస్తుందన్న గట్టి విశ్వాసంతో ప్రధాని మోడీ చేస్తున్న కృషి అద్భుతం.. అపూర్వం. దీంతో 'డిజిటల్ ఇండియా'కు మార్గం సుగమమైనట్లే. భారతావనిలో స్వచ్ఛమైన ఆర్థికవ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లే. అందుకు ప్రధాని మోడీని, ప్రభుత్వాన్ని అభినందించక తప్పదు.**

# నెల్లూరులో లేపాక్షి క్రాఫ్ట్ బజార్



ఈ నెల 10 నుంచి 20వ తేది దాకా లేపాక్షి క్రాఫ్ట్‌బజార్‌ను నెల్లూరులోని టిటిడి కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ సహకారంతో చేనేత కళను, హస్తకళలను ఆదరించి ప్రోత్సహించాలన్న ధ్యేయంతో లేపాక్షి క్రాఫ్ట్ బజార్ ప్రదర్శన, అమ్మకాలను నిర్వహిస్తున్నామని తిరుమల లేపాక్షి క్రాఫ్ట్‌బజార్ మేనేజర్ కె. వెంకటేశ్వరరావు, తిరుపతి మేనేజర్ దేవేంద్రకుమార్ తెలిపారు. ఇందులో పలు ప్రాంతాల చేనేతకారులు, హస్తకళాకారులు రూపొందించిన వస్త్రాలు, అలంకరణ వస్తువులు, బొమ్మలు..ఆటవస్తువులు వగైరాలను ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశామని, మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ ఉత్పత్తులను కొనుగోలుచేసి ఆ కళాకారులను ఆదరించాలని వారు వినియోగదారులకు విజ్ఞప్తిచేశారు. ఈ నెల 11వ తేది నుంచి ప్రతిరోజు రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన, అమ్మకాలు వుంటాయని, ప్రజలు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించి ప్రోత్సహించాలని వారు కోరారు.

# జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక

ది నెల్లూరు డిస్ట్రిక్ట్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న జిల్లాస్థాయి బాలబాలికల జట్ల ఎంపికను నిర్వహించారు. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన ఈ ఎంపికల్లో బాలుర విభాగంలో అతిఖ్, వచన్, సాయి ధీరజ్, సోహిల్, పవన్‌కుమార్, ప్రేమ్‌సాయి విజ్ఞాన్, ప్రదీప్‌కుమార్, ధనుష్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో గోపీచందన, జావళి, అంకిత, శివాని, అంజనాద్రి ఎంపికయ్యారు. ఈ నెల 17, 18 తేదీల్లో కాకినాడలో జరిగే రెండవ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్, జూనియర్స్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే అండర్-7 అండర్-17 విభాగం వరకు స్విమ్మింగ్ జట్లను ఎంపిక చేశారు. ఎంపిక కమిటీ సభ్యులు గాదం శ్రీనివాస రావు, గురుప్రసాద్, చంద్రశేఖర్, సుబ్బారావు, మధు, కోచ్ నాగరాజు పాల్గొని ఎంపికలు పూర్తిచేశారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సనత్‌కుమార్, శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట మనోహరం, స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి పసుపులేటి రామ్మూర్తి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# సాయి తత్వం.. మార్గదర్శకం

సాయి తత్వం మానవాళికి మార్గదర్శకమని, షిర్డీసాయి బోధలు భవితకు మార్గదర్శకమని స్వామి శ్రీ సాయి విశ్వచైతన్య అన్నారు. నెల్లూరులోని టౌన్‌హాలులో సోమవారం 250వ శిరిడి సాయి గీతాజ్ఞాన యజ్ఞ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ గీతాజ్ఞానయజ్ఞ ప్రవచనాల్లో భాగంగా, సోమవారం శ్రీసాయి విశ్వచైతన్య ప్రసంగిస్తూ భగవంతుడు నిర్ణయించిన విధి విధానాలలో సనాతన ధర్మంగా ప్రఖ్యాతిలోకి వచ్చాయన్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయాల్లో గురుతత్వం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. శ్రీ షిర్డీ సాయిబాబా బోధనలు ఎంతో అమూల్యమైనవని అన్నారు. శ్రీసాయి జీవితం ఆదర్శప్రాయమన్నారు. సాయి బోధనలు ప్రతి ఒక్కరికీ పరిపూర్ణత చేకూరుస్తాయన్నారు. తొలుత ఆయన శ్రీ సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేశారు. సనాతన ధర్మం, సాయితత్వం తదితర విషయాలపై ఆయన చేస్తున్న ప్రసంగాలు అందరినీ బాగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రవచనాలను వినేందుకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసారు. షిరిడీ సాయితత్వ ప్రచారసమితి కన్వీనర్ చీతిరాల రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.




## మంత్రిదే బాధ్యత

మంత్రి నారాయణకు గురువో, శిష్యుడో తెలియదు గాని వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టాడు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూడా మంత్రి తన మనిషినే పెట్టుకుంటాడు. ఈ రెండు నియోజకవర్గాలలో అభ్యర్థులను గెలిపించే బాధ్యత కూడా నారాయణదే! ఇక మన మంత్రి మాటలవీరుడు. చీకటి శూరుడు. చెప్పింది ఒక్కటీ చెయ్యడు. నెల్లూరు జిల్లాలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. నెల్లూరును వాగ్ధానాలతో కాకుండా వాస్తవాలతో అభివృద్ధి చేసేందుకు మంత్రి నారాయణ మనసుపెట్టాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## జయ మృతిపై విచారణ జరిపించాలి

తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత మృతిపై కేంద్రం విచారణ జరిపించాలి. చావుపుట్టుకలు మనిషికి సహజమే! అయితే కొన్ని మరణాలలో అనుమానాలూ సహజమే! జయలలిత వృద్ధాప్యంతో మరణించలేదు. అకస్మాత్తుగా వచ్చే వ్యాధులతో మరణించలేదు. ఆమె మరణంలో షుగర్, బి.పిలదే ప్రధానపాత్ర. ఇవి ఒక్క రోజులో వచ్చేవి కావు. ఒక సీఎంకు నిరంతర వైద్య పరీక్షలు, అందుకు తగ్గ వైద్యసేవలు ఉంటాయి. ఇన్ని వున్నా కూడా జయలలిత ఆసుపత్రి పాలయ్యారంటే అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

**మురుగేష్, సూళ్లూరుపేట.**

## నమ్మకం పోతోంది?

రాజ్యాంగ వ్యవస్థలన్నీ కూడా అడ్డదారి తొక్కుతున్నాయి. ఇటీవల ప్రజలు అంతో ఇంతో నమ్మేది న్యాయవ్యవస్థనే! కాని ఈమధ్య వస్తున్న తీర్పులను చూస్తుంటే న్యాయవ్యవస్థ మీద కూడా నమ్మకం పోతుంది. కృష్ణజింకల వేట కేసులో, తాగి కారు నడిపి ఫుట్‌పాత్‌పై పడుకున్న వారిని తొక్కించిన కేసులో సల్మాన్‌ఖాన్ నిర్దోషి... మరి జింకలు ఆత్మహత్య చేసుకున్నాయా? ఫుట్‌పాత్‌పై వున్నవాళ్ళే సల్మాన్ కారు క్రింద వచ్చి పడ్డారా...? అలాగే ఓటు-నోటు కేసులో చంద్రబాబు నిర్దోషి... మరి ఓటుకు నోట్లు ఇవ్వడం తప్పు లేనప్పుడు ఎలక్షన్‌లలో ఓట్లకు ఆయా రాజకీయ పార్టీలు వేలం పాట నిర్వహించుకుంటే పోతుందిగా!

**కటకం రాంసాగర్‌రెడ్డి, మైదుకూరు.**

# అవినీతికి సెంటర్... డివైడర్



తవ్విన చోటే తవ్వడం... ఎత్తిన మట్టే ఎత్తడం...
వేసిన మొక్కే నాటడం... తొలగించిన రాయినే అతికించడం...
చేసిన పనినే మళ్లీ చేసినట్లు బిల్లు పెట్టడం...
ఇదే కదా కేరాఫ్ కరప్షన్... దోపిడీకి మెయిన్ కనెక్షన్!

*అవినీతి, అక్రమాల విషయంలో మనం 'అమరావతి' కథలు వింటున్నాం. భూసేకరణ నుండి తాత్కాలిక భూములు, స్విస్ ఛాలెంజ్‌పై సింగపూర్ కన్సార్టియంకు కాంట్రాక్ట్ ఇవ్వడం, పనులకు అంచనాలు పెంచడం, పనుల్లో నాణ్యత లోపించడం... ఇవన్నీ చూస్తుంటే అవినీతి ఇంత దారుణంగా వుంటుందా అనిపిస్తుంది. అయితే మనం దారుణమైన అవినీతి గురించి తెలుసుకోవడానికి అమరావతి దాకా పోనవసరం లేదు. నెల్లూరులోనే ఎన్నో ఆనవాళ్లున్నాయి. నెల్లూరు నగరపాలక సంస్థ కేంద్రంగా జరిగే అవినీతి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. నెల్లూరుజిల్లాకే చెందినవాడైన మున్సిపల్ మంత్రి పి.నారాయణ ఇక్కడి నగర పాలకులకు అవినీతి లైసెన్స్‌లు ఇచ్చినట్లుగా వుంది ఇక్కడి వ్యవహారం.*

నెల్లూరు నగరపాలక సంస్థలో అవినీతి పలు రూపాలలో తన పనులు తాను చేసుకుపోతోంది. వాటిలో ఒక రూపమే డివైడర్‌ల అభివృద్ధి! ఈ డివైడర్‌ల అభివృద్ధి అంటే ఏంటో ఎవరికీ అర్థం కావడం లేదు. ఇటీవల నెల్లూరు నగరంలో డివైడర్‌ల అభివృద్ధి అంటూ దాదాపు కోటి రూపాయలు మంజూరు చేశారు. రోడ్ల మీద డివైడర్‌లు కొత్తగా కట్టడం లేదు. ఇప్పుడున్న డివైడర్లలో వున్న మట్టిని తీసి మళ్ళీ అదే మట్టిని నింపుతున్నారు. అక్కడ నాలుగు పిచ్చి మొక్కలు నాటి దానినే డివైడర్ అభివృద్ధి అంటున్నారు. ఈ పనులకే లక్షల రూపాయల బిల్లులు పెడుతున్నారు. ఇవన్నీ కూడా మేయర్ కనుసన్నలలో జరుగుతున్న పనులే! నాటు భాషలో చెప్పాలంటే ఉడ్డమోసపు పనులు.

గత పాలకవర్గంలోనూ నగరంలో డివైడర్లు నిర్మించారు. అయితే ఇవి కార్పొరేషన్ నిధులతో చేపట్టలేదు. డివైడర్‌ల మీద ప్రకటన బోర్డులు పెట్టుకోవడానికి అనుమతి తీసుకున్న వాళ్ల చేత డివైడర్లు కట్టించారు. దీని వల్ల కార్పొరేషన్‌కు రూపాయి ఖర్చు లేకుండా పోయింది. ఇప్పటి పాలకవర్గంలో లాగా గత పాలకవర్గం కూడా ఇంతటి దారుణ మోసాలకు పాల్పడివుంటే ఈ కార్పొరేషన్ బిల్డింగ్‌ను కూడా అమ్ముకోవాల్సి వచ్చేది.

# మన బ్యాంకుల్లోనూ గోల్‌మాల్!



**నవంబర్ 12 - 15తేదీల మధ్య...** మాకు తెలిసిన బ్యాంకు ఆఫీసర్ వద్ద 2కోట్లు 2వేల నోట్లున్నాయి. 30శాతం కమిషన్‌తో ఇస్తాడు... బ్లాక్‌మనీ ఉన్నోళ్లు ఎవరైనా ఉంటే చెప్పండి... మార్పిద్దాం.

**నవంబర్ 25 - 30తేదీల మధ్య...** ఒక చోట 2వేల నోట్లున్నాయి... 20శాతం కమిషన్... ఎవరన్నా ఉంటే చెప్పండి... మార్పిస్తాను.

**డిసెంబర్ 1 - 10 తేదీల మధ్య...** మాకు తెలిసినవాళ్ల వద్ద 2వేల కరెన్సీ వుంది. 10శాతం కమీషన్‌తో ఇచ్చేస్తారు... పెద్దనోట్లుంటే చెప్పండి.

గత నెలరోజుల కాలంలో మార్కెట్‌లో మధ్యవర్తుల నుండి వచ్చిన ఆఫర్లు ఇవి. దీనినిబట్టి చూస్తుంటేనే బ్యాంకుల ద్వారా ఎంత నల్లధనం మార్పిడి జరిగిందో అర్థమవుతుంది. అయితే నెల్లూరుజిల్లాలో నోట్ల మార్పిడి అక్రమాలకు తెరతీసిన కొందరు బ్యాంకర్లకు 30శాతం కమిషన్ వ్యాపారం చాలా తక్కువుగా జరిగినట్లు తెలుస్తోంది. దీనికి కారణం మన జిల్లా మంత్రి నారాయణే! ఎందుకంటే జిల్లాలో వడ్డీ వ్యాపారుల వద్ద వున్న బ్లాక్‌మనీ అంతా అతని వద్దకు వెళ్లిపోయింది. కాబట్టి వాళ్లకు 30శాతం కమీషన్ ఇచ్చి కొత్త నోట్లతో పెద్దనోట్లను మార్చుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. 30శాతం కమీషన్‌తో చాలాతక్కువ లావాదేవీలు జరిగాయని తెలుస్తోంది. 20శాతం కమీషన్‌తో మాత్రం చాలామంది మార్చుకున్నారు. అయితే అది లక్ష నుండి 10లక్షల లోపు మొత్తాల్లోనే అధికంగా వున్నట్లు సమాచారం. వివాహాలు, గృహనిర్మాణాలు, వ్యాపార లావాదేవీలు వున్నోళ్లు మాత్రం అత్యవసర ఖర్చులకుంటాయని చెప్పి 20శాతం కమీషన్‌తో మార్చుకున్నారు. అయితే బ్లాక్‌మనీ భారీగా వుంటుందని చెప్పి, కొత్త నోట్లను పెద్దఎత్తున ఎత్తిపెట్టిన బ్యాంకర్లకు నగదు మార్పిడి కోసం పెద్దగా స్పందన రాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. తమ వద్ద నిల్వ పెట్టిన నోట్లకు రద్దయిన నోట్లలో లెక్కలు చూపించాల్సి రావడంతో చివరకు 10శాతం కమీషన్‌తో కూడా నగదు మార్పిడి చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారవేత్తలు కూడా ఈ జిల్లాకు బ్లాక్‌మనీ పంపించి నగదు మార్పిడి చేసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త నోట్లను అక్రమమార్గం పట్టించడంలో ప్రభుత్వ బ్యాంకుల కంటే కూడా ప్రైవేట్ బ్యాంకులు కీలకపాత్ర పోషించాయని, వాటి ఇష్టారాజ్యంగా వ్యవహరించాయని సమాచారం.

# కౌంట్‌డౌన్..
## ఇక రెండు వారాలే!



ఇక గట్టిగా రెండు వారాలు... బ్యాంకుల ముందు, ఏటిఎంల ముందు మనం 'క్యూ'లలో నిల్చోవడానికి మిగిలిన రోజులు. డిసెంబర్ 30తో నోట్ల మార్పిడికి ఆఖరిరోజు. ఆ తర్వాత ప్రధాని చెప్పినట్లు 'అచ్చేదిన్' వస్తుందా, జనం 'చచ్చేదిన్'లు వస్తాయా అన్నది వేరే సంగతి! పెద్దనోట్ల రద్దు తర్వాత కొత్త నోట్ల కోసం, చిన్న నోట్ల కోసం ప్రజలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నవంబర్ 8వ తేదీ రాత్రి పెద్దనోట్లు రద్దును ప్రకటించారు. 9వ తేదీ నుండి బ్యాంకుల ముందు, ఏటిఎంల ముందు 'క్యూ'లు మొదలయ్యాయి. క్యూలలో జనం మొదటి రోజు ఏ విధంగా వున్నారో ఈ రోజుకీ అదే విధంగా ఉంటున్నారు. నోట్ల రద్దు తర్వాత వారంలోపే అంతా సర్దుకుంటుందని, వారం తర్వాత 'క్యూ'లు వుండవని భావించారు. కాని ఆర్‌బిఐ పంపించిన కొత్త కరెన్సీ సగం బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లడం, ఒకసారి తీసుకున్న వాళ్ళే మళ్ళీ మళ్ళీ డబ్బులు విత్‌డ్రాకు వస్తుండడంతో బ్యాంకులు, ఏటిఎంల ముందు ఏ మాత్రం క్యూలు తగ్గలేదు. జిల్లా వ్యాప్తంగా కూడా నగదు డిమాండ్ అధికంగా వుండగా సరఫరా అంతంత మాత్రంగా వుంది. ప్రజలకు డబ్బు అందివ్వలేక బ్యాంకులు చేతులెత్తేస్తున్నాయి. ఏటిఎంలలో పెట్టిన డబ్బు రెండు గంటల్లో ఖాళీ అవుతుంది. జిల్లాలో ఎప్పుడు చూసినా 80శాతం ఏటిఎంల ముందు 'నో క్యాష్' బోర్డులే దర్శనమిస్తున్నాయి. పెద్దనోట్ల రద్దు తర్వాత జిల్లా వ్యాప్తంగా కూడా అన్ని రకాల వ్యాపారాలు దెబ్బతిన్నాయి. మొత్తం వందల కోట్లలోనే వ్యాపార నష్టం వుంటుంది. 2016 నష్టాలతో ముగుస్తుంది. ఈ నెలాఖరుతో ఈ నోట్ల కష్టాలు ముగుస్తాయి. కనీసం కొత్త సంవత్సరంలోనన్నా కొత్త కరెన్సీ సమస్యలు తీరుతాయోమోనని ప్రజలు ఆశిస్తున్నారు.

# నెల్లూరు 'రియల్' కోలుకునేనా?



- దీనావస్థకు చేరిన సింహపురి రియల్ మార్కెట్
- ఇంకో ఏడాది దాకా లావాదేవీలు లేనట్లే!
- రిజిస్ట్రేషన్లు లేక బోసిపోతున్న రిజిస్ట్రార్ ఆఫీసులు
- పనులు లేక స్టాంపు వెండర్లు, డాక్యుమెంటురైటర్ల ఆందోళన

మొన్నటివరకు చంద్రబాబు దెబ్బకు, నిన్న పెద్దనోట్ల రద్దు దెబ్బకు నెల్లూరు జిల్లాలో రియల్ ఎస్టేట్ కుప్పకూలడం తెలిసిందే! జిల్లాలో రియల్ ఎస్టేట్ బాగా నడిచింది 1999-2009 మధ్య కాలంలోనే! 1999లో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాలుగులైన్ల రహదారి విస్తరణ వల్ల జాతీయ రహదారుల వెంబడి వున్న భూములకు విపరీతమైన రేట్లొచ్చాయి. జాతీయ రహదారి వెంబడి ఎకరా నలభై లక్షల నుండి మూడుకోట్లు దాకా ధర పలికాయి. 2004లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, వై.యస్ ముఖ్యమంత్రి కావడంతో నెల్లూరుజిల్లాలో రియల్‌ఎస్టేట్ ఓ వెలుగు వెలిగింది. జిల్లాలో అనేక సెజ్‌లు వచ్చాయి. తొండలు గుడ్లు పెట్టే భూములు సైతం బంగారమయ్యాయి. రైతులు రాజులయ్యారు. ఎవరింట పట్టినా కాసుల గలగలలే. భూముల అమ్మకాలు, కొనుగోళ్లు మూడు పువ్వులు, ఆరు కాయలుగా జరిగాయి.

నెల్లూరుజిల్లా రియల్ రంగంలో అదే వాతావరణం కొనసాగి వుంటే ఈవరకు భూముల రేట్లు కోట్లలోనే వుండేవి. ముత్తుకూరురోడ్డులో ఎకరా భూమి 10కోట్లను తాకినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. కాని 2009లో కృష్ణపట్నం పోర్టు ప్రారంభోత్సవానికి సోనియాగాంధీ వచ్చి వెళ్లాక రియల్‌బూమ్ ఒక్కసారిగా పడిపోయింది. ఆ తర్వాత వై.యస్ చనిపోవడంతో ఈ జిల్లాలో రియల్ ఎస్టేట్ పూర్తిగా లేవలేకపోయింది.

2014 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చుంటే నెల్లూరు రియాల్టీకి మంచి రోజులొచ్చుండేవి. రియల్టర్లు అప్పుల నుండి కొంతన్నా బయటపడుండేవాళ్లు. జగన్ సీఎం అయ్యుంటే రియల్ పరిస్థితి వేరే విధంగా వుండేది. రాజధాని ప్రకాశం జిల్లాకి వచ్చుండేది. దాని ప్రభావంతో నెల్లూరుజిల్లాలోనూ రియల్‌కు రెక్కలొచ్చేవి. కాని చంద్రబాబు సీఎం కావడం, అమరావతిలో రాజధాని పెట్టడంతో నెల్లూరుజిల్లాలో రియల్‌ఎస్టేట్ పడిపోయింది. గత పదేళ్లుగా కూడా జిల్లాలో సూళ్లూరుపేట, నెల్లూరు వంటి ప్రాంతాల్లో తప్పితే ఇంకెక్కడా రియల్ వ్యాపారం లేదు. రియల్ ఎస్టేట్ మీద ఆధారపడే జిల్లాలో కొన్ని వేలమంది బ్రతుకుతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని కోట్ల రూపాయల టర్నోవర్ దీనివల్లే జరుగుతుంది. పెద్దనోట్ల రద్దు మూలంగా జిల్లాలో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడుకుంది. ఇక ఇది ఎప్పటికి కోలుకుంటుందో, అప్పులు తెచ్చిన రియల్టర్లు, అప్పులు ఇచ్చిన ఫైనాన్షియర్లు ఎప్పటికి తేరుకుంటారో కూడా చెప్పలేని పరిస్థితులు నెలకొనివున్నాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరు కబుర్లు

## రిలీవ్ కాకముందే..
# కలెక్షన్ సర్దుకుని...

ఏ శాఖలో అధికారి అయినా ఒకచోట నుండి బదిలీ అయ్యాడంటే రిలీవ్ అయ్యే రెండుమూడురోజులన్నీ కూడా బ్యాలెన్స్ కలెక్షన్ల మీదే దృష్టి పెట్టుంటాడు. కలెక్షన్ రాక అప్పటి దాకా పెండింగ్‌లో పెట్టివున్న ఫైళ్లన్నింటిని ఎంతోకొంత తీసుకుని అప్పటి కప్పుడు క్లియర్ చేస్తుంటారు. ప్రస్తుతం నెల్లూరు నగరపాలక సంస్థలో ఇదే జరుగుతోంది. కమిషనర్ వెంకటేశ్వర్లు బదిలీ కావడం తెలిసిందే! దాంతో కాంట్రాక్టర్లు, కార్పొరేటర్లందరూ వివిధ పనులకు సంబంధించిన బిల్లుల ఫైళ్లపై చకచకా సంతకాలు పెట్టించుకున్నారు. అవి కూడా పాత తేదీలతో అని తెలుస్తోంది. అలాగే పెండింగ్‌లో వున్న కలెక్షన్లు కూడా రాబట్టుకుంటున్నట్లు సమాచారం.

# మూడురోజులు ఆగచాల్లే!

• పనిచేయని ఏటిఎంలు

అసలే పెద్దనోట్ల రద్దుతో జనం అల్లాడుతున్నారు. బ్యాంకులకు వెళితే తగినంత నగదు ఇవ్వడం లేదు. ఏటిఎంల ముందు గంటలకొద్దీ క్యూలలో నిలబడినా ఉపయోగం లేకుండా పోతోంది. చేతిలో చిల్లర ఖర్చులకు కూడా డబ్బులు లేని పరిస్థితి. ఈ సమయంలో వరుసగా మూడురోజులు బ్యాంకులకు సెలవులొస్తే... మూడురోజులు ఏటిఎంలలో డబ్బులు లేకపోతే... ఇక ఆ బాధలు చెప్పనలివి కాదు. మొన్న 9వ తేదీ రెండో శనివారం, 10వ తేదీ ఆదివారం, 11వ తేదీ మిలాద్ ఉన్ నబీ... వరుసగా మూడురోజులు బ్యాంకులకు సెలవులు. డబ్బుల కోసం జనం పడ్డ అగచాట్లు అన్నీ ఇన్నీ కావు.

## ఐసిడిఎస్ ఇన్‌ఛార్జ్ పి.డిగా హరిత



ఐసిడిఎస్ ఇన్‌ఛార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా డ్వామా పి.డి హరితను నియమించారు. ఇక్కడ పి.డిగా వున్న విద్యావతిని ఏలూరుకు బదిలీ చేయడం జరిగింది.

# భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ




మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని సోమవారం వేడుకగా నిర్వహించుకున్నారు. నెల్లూరు నగరంలోని కామాటివీధిలో వున్న మస్జిద్ ఏ ఆయేషా ఇమామ్ హాఫీజ్ ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో వేలాది మంది ముస్లింసోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని మతపెద్దలు వివరించారు. ఇస్లాం ప్రబోధనల మేరకు ప్రతిఒక్కరూ సోదరభావంతో జీవించాలని వారు ఆకాంక్షించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మసీదుల ఇమామ్‌ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నగరోత్సవం నిర్వహించారు. ఎంతో పవిత్రమైన మదీనా నమూనాను విద్యుద్దీపాలంకరణల మధ్య శోభాయమానంగా ఏర్పాటుచేశారు.

ఎంతో వైభవంగా జరిగిన ఈ నగరోత్సవంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, వక్ఫ్‌బోర్డ్ మాజీ ఛైర్మన్ సయ్యద్ సమీ, వైఎస్సార్సీపి మైనార్టీ నాయకుడు హంజాహుస్సేని, ఇంతియాజ్, అబ్దుల్ అలీమ్‌తో పాటు, మతపెద్దలు షేక్ అబ్దుల్ హనీఫ్, షేక్ సయీద్, సర్దార్, ఫజులుర్ రెహ్మాన్, దస్తగిరి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను బాధితులను ఆదుకోవాలి

## - డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య



వార్దా తుఫాను బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని నెల్లూరు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం తన కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, అధికారులకు సహకరించి, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే సహాయక చర్యలు ప్రారంభించాలని కోరారు. రేషన్‌షాపుల్లో సరిపడా నిత్యావసర సరుకులు నిల్వ చేయాలని కోరారు.

# నెల్లూరు తడిచింది

నవంబర్‌లో కూడా వర్షాలు లేవు... ఇక డిసెంబర్ కూడా దాటిపోతే నెల్లూరులో నీళ్ల కరువు తప్పదనుకుంటున్న తరుణంలో వార్దా తుఫాన్ మూలంగా వర్షాలు కురిసాయి. ఈ వర్షాలతో నెల్లూరు తడిచింది. అయితే ఈ వర్షాలు నెల్లూరు నగర దాహార్తిని తీర్చలేవు. సంవత్సరం పొడవునా మనకు నీటి కొరత లేకుండా వుండాలంటే నగరంలో వున్న నాలుగు అండర్ బ్రిడ్జిలు (మాగుంట లేఅవుట్, రామలింగాపురం, విజయమహల్‌గేటు, ఆత్మకూరు బస్టాండ్) నిండేలా వర్షాలు కురవాలి. ఈ బ్రిడ్జిల గుండా కనీసం రెండురోజులన్నా రాకపోకలు బంద్ కావాలి. అండర్ బ్రిడ్జిలు నిండే వానలు పడితేనే మనకు భారీవర్షాలు కురిసినట్లు లెఖ్ఖ!

## వాకర్స్ జిల్లా గవర్నర్‌గా
# మైథిలి మనోహర్‌రెడ్డి



వాకర్స్ జిల్లా గవర్నర్‌గా మైథిలి మనోహర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరానికి గుంటూరు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల వాకర్స్ గవర్నర్‌గా తన నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన వాకర్స్ అంతర్జాతీయ సంస్థ సిల్వర్‌జూబ్లీ కన్వెన్షన్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య అందజేసినట్లు తెలిపారు.

## అథ్లెటిక్స్‌కు కొత్త అధ్యక్షుడు

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎన్నికయ్యారు. సోమవారం నెల్లూరులోని వి.ఆర్ ఉన్నత పాఠశాలలో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి పసుపులేటి రామ్మూర్తి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. నూతన అధ్యక్షునిగా కోడూరు రవీంద్రరెడ్డి, ఉపాధ్యక్షునిగా అరిగెల ప్రభాకరరావు, కార్యదర్శిగా అరిగెల విజయకుమార్, సంయుక్త కార్యదర్శిగా నరసింహారావు ఎన్నికైనట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

# నవీద్‌కు బాలశ్రీ అవార్డు



నెల్లూరు బాలభవన్ నుంచి సృజనాత్మక సైన్స్ పరిశోధన అనే అంశంలో నెల్లూరుకు చెందిన సయ్యద్ నవీద్ హుస్సేన్‌కు బాలశ్రీ అవార్డు లభించింది. ఆగస్టు 15న జరిగిన జాతీయ బాలశ్రీ పోటీల్లో పాల్గొన్న నవీద్ హుస్సేన్ ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి మాట్లాడుతూ దాదాపు 10సంవత్సరాల తర్వాత నెల్లూరు బాలభవన్‌కి బాలశ్రీ అవార్డు లభించడం గర్వకారణమన్నారు. భారతదేశంలో 150 బాలభవన్ల నుంచి జాతీయస్థాయికి ఎంపికైన 20మందిలో నెల్లూరు నుంచి సైన్స్ విభాగంలో సయ్యద్ నవీద్‌హుస్సేన్‌కు బాలశ్రీ అవార్డు దక్కిందన్నారు. ఈ అవార్డును 2017వ సంవత్సరం ఏప్రిల్ నెలలో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుంటారన్నారు. ఈ విద్యార్థి నెల్లూరు మూలాపేటలోని లిటిల్ ఏంజెల్స్ స్కూలు నుంచి నెల్లూరు బాలభవన్ నిర్వహించిన పోటీల్లో విజయం సాధించి అనంతరం హైదరాబాద్‌లో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో గెలుపొంది తర్వాత న్యూఢిల్లీలో జాతీయ బాలభవన్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొంది ఈ అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. ఇది సింహపురికే గర్వకారణమన్నారు.

### మంత్రి నారాయణ అభినందనలు...

బాలశ్రీ అవార్డుకు ఎంపికైన నెల్లూరు మూలాపేట లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్ విద్యార్థి సయ్యద్ నవీద్ హుస్సేన్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ నెల్లూరుజిల్లాకు చెందిన విద్యార్థి ఈ అవార్డుకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. సైన్స్ ఇన్నోవేటివ్ విభాగంలో నవీద్ ఈ అవార్డు సాధించాడని స్కూలు కరస్పాండెంట్ చాట్ల నరశింహారావు పేర్కొన్నారు. స్కూల్ డైరెక్టర్లు చాట్ల రాజేష్, విద్యార్థి తండ్రి వాసీం పాల్గొన్నారు.

# ఇస్కాన్‌లో గీతాజయంతి



నెల్లూరు కొండాయపాళెంరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో ఈ నెల 10వ తేదీన గీతాజయంతి సందర్భంగా గీతాయజ్ఞం, గీతా పారాయణం నిర్వహించారు. మందిరం అధ్యక్షుడు డాక్టర్ శుకదేవ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గీతాపారాయణం, హరేకృష్ణ భజనలు చేశారు. స్థానిక కార్పొరేటర్ నూనె మల్లిఖార్జునయాదవ్ కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను విడుదల చేశారు.

# శబరి శ్రీరామక్షేత్రంలో హనుమద్వ్రతం

నెల్లూరు దర్గామిట్ట రాంనగర్ ప్రాంతంలో వున్న శబరి శ్రీరామక్షేత్రంలో సోమవారం హనుమద్వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామికి విశేషంగా అభిషేకాలు, ఆకుపూజలు, హోమం జరిగాయి. ఆంజనేయస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు రొంపిచర్ల భావనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. దేవస్థానం ఛైర్మన్ చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పర్యవేక్షించారు.

# శ్రీ కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామికి బంగారు రథం

## - శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి

ప్రముఖ పుణ్యక్షేత్రం కంచి కామ కోటి పీఠం పరిధిలోని శ్రీకామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి వారికి బంగారు రథం తయారు చేయించాలని నిర్ణయించినట్లు కంచి పీఠాధిపతి శ్రీ శంకర జయేంద్ర సరస్వతి మహాస్వామి తెలిపారు. నెల్లూరు మూలాపేటలోని శంకర మఠానికి కంచి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతిస్వామి, శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి విచ్చేసిన సందర్భంగా ఆదివారం శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి విలేకర్లతో మాట్లాడుతూ స్వామి, అమ్మవారి ఆదేశానుసారం బంగారు రథం నిర్మాణానికి సంకల్పించినట్లు తెలిపారు. సుమారు 30కేజీల బంగారం రథం తయారీకి అవసరమవుతుందన్నారు. రథం నిర్మాణానికి భక్తులు చేయూతనందించి పరమేశ్వరుని కృపకు పాత్రులు కావాలన్నారు. జూలై 25 నుంచి ఆంధ్రరాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటించి తిరుగు ప్రయాణంలో నెల్లూరుకు వచ్చినట్లు తెలిపారు.


### శంకరమఠంలో విశేషపూజలు...

నెల్లూరు మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలో కొలువైయున్న శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి



స్వామి విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారు స్వయంగా తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, వివిధ దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

# వార్ధ వ్యర్థమైంది!



## • తుఫాన్‌లు కూడా కరుణించడం లేదు
## • వాయుగుండాలొచ్చినా వర్షాలు లేవు

*బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. అది వాయుగుండంగా మారింది. రేపు రాత్రికి నెల్లూరు-బందరుల మధ్య తీరం దాటనుంది... కొన్నేళ్ల క్రితం రేడియోలలో ఇలాంటి వార్తలు విన్నప్పుడు ప్రజలు వణికిపోయేవాళ్లు. ఓ నెలకు సరిపడా తిండిగింజలు నిల్వ చేసుకునే వాళ్లు. పూరిళ్లు, రేకుల ఇళ్లు వదిలేసి కొంచెం గట్టిగా ఉండే ఇళ్లలో తలదాచుకునేవాళ్లు. తుఫాన్ వస్తుందంటే సముద్రంలో నుండి ఓ గాలిభూతం లేచి తమ మీద పడుతున్నంతగా భయపడేవాళ్లు.*

కాని ఇప్పుడు... పరిస్థితి మారింది. వాయుగుండాలకు స్వాగత తోరణాలు కట్టి ఆహ్వానించే పరిస్థితులొచ్చాయి. తుఫాన్‌లను మా ప్రాంతంలో తీరం దాటించేలా చేయమని భగవంతుడిని కోరుకునే దిక్కుమాలిన దుస్థితి దాపురించింది. దీనికి కారణం తీవ్ర వర్షాభావ పరిస్థితులే! సీజన్‌ల వారీగా కురవాల్సిన వానలు కురవకపోవడమే!

సముద్రంలో అల్పపీడనాలు ఏర్పడితే తప్పితే నెల్లూరుజిల్లాలో సాధారణ వర్షాలు కనుమరుగయ్యాయి. చిత్త, విశాఖ, స్వాతి వంటి కార్తెల్లో కూడా వర్షాలు కురవడం లేదు. పర్యావరణ సమతుల్యం దెబ్బ తినడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. నెల్లూరు జిల్లాలో అయితే ప్రతి ఏడాది జూన్, జూలై నెలల్లో ఒక పదును వాన పడేది. తిరిగి అక్టోబర్, నవంబర్ నెలల్లో ఈశాన్య ఋతుపవనాల వల్లగాని, సముద్రంలో అల్పపీడనాల వల్లగాని భారీ వర్షాలు కురిసి చెరువులు, బావులు, రిజర్వాయర్‌లు నిండేవి. దీనివల్ల సంవత్సరం పొడవునా తాగునీళ్లకు సాగు నీళ్లకు ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు జిల్లాలో తుఫాన్‌ల మూలంగా కూడా వర్షాలు లేకుండా పోయాయి.

గత ఏడాది నవంబర్‌లో జిల్లాలో కుండపోత వర్షాలు కురిసాయి. జిల్లాలోని పలు ప్రాంతాలు ముంపుకు గురికావడం కూడా జరిగింది. ఈ ఏడాది నవంబర్ దాటిపోయింది. డిసెంబర్ నెల సగమై పోయింది. ఇక జిల్లాకు వర్షమే లేదా అని అనుకుంటున్న తరుణంలో 'వార్ధా' తుఫాన్ ఆశలు రేపింది. మొదట ఈ తుఫాన్ బందరు – నెల్లూరు మధ్య తీరం దాటుతుందని అంచనా వేసారు. నెల్లూరు వద్ద తీరం దాటుద్దని టీవీ ఛానెల్స్ ఘోషించినా ప్రజలు బెదరలేదు, సరికదా సంతోషపడ్డారు. ఈ తుఫాన్ మూలంగా భారీ వర్షాలు కురుస్తాయని చెబుతుంటే నీళ్ల కరువు తీరినట్లేనని ఆశపడ్డారు. తీరా చూస్తే ఈ తుఫాన్‌లకు కూడా నెల్లూరుపై కనికరం లేనట్లుంది. తుఫాన్ చెన్నై వద్ద తీరం దాటింది. భారీ వర్షాలన్నీ కూడా తమిళనాడులో పడ్డాయి. నెల్లూరుజిల్లాలో నామమాత్రపు వర్షాలు పడ్డాయి. అది కూడా జిల్లాలో తూర్పువైపు మండలాలలోనే! మెట్ట ప్రాంతంలో ఆకాశం మబ్బులు పట్టి ఉండటం తప్పితే చినుకు లేదు. భారీ తుఫాన్‌లప్పుడు కూడా జిల్లాలో వర్షాలు లేకపోతే ఇక సాధారణ పరిస్థితుల్లో వానలేం పడతాయో!


### ఊరట కలిగించని 'వార్ధా' వాన

వార్ధా తుఫాన్ గమనం మారడంతో ఎట్టకేలకు జిల్లాకు తుఫాన్ ముప్పు తప్పింది. అంతేకాదు, తుఫాన్‌వల్ల గాలులు వీచి కొంతమేరకు నష్టం వాటిల్లినా, వార్ధా ప్రభావంతో కురిసిన వర్షం రైతాంగానికి, ముఖ్యంగా మెట్టప్రాంత రైతులకు పెద్దగా వూరట కలిగించలేదు.

# పెళ్ళామే బల్లెమైంది...

## ప్రియుడితో కలిసి నగలు చోరీ!





కట్టుకున్న పెళ్ళామే తన భర్తకు పక్కలో బల్లెంలా మారింది. ప్రియుడితో కలిసి ఇంట్లో వున్న ఒకటిన్నర కేజీ బంగారు నగల దోపిడీకి స్కెచ్ వేసింది. నగలు చోరీకి గురైనట్లు పెద్దనాటకమే ఆడింది. పోలీసులు కొంచెం లోతుగా విచారణ జరపడంతో అసలు నిందితురాలు ఆమె, ఆమె ప్రియుడేనని తేలింది.

జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ ఈ కేసుకు సంబంధించి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఈ నెల 4వ తేదీన నెల్లూరు, వన్‌టౌన్ పరిధిలోని శిఖరం వారి వీధిలో వుంటున్న తమ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి తన భార్య పూజ జైన్, తన తండ్రి మిశ్రమల్ జైన్‌లను బంధించి ఇంట్లో వున్న 1500 గ్రాముల బంగారం దొంగిలించినట్లు రంజిత్‌కుమార్‌జైన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసాడు. ఈ ఫిర్యాదుని స్వీకరించిన సిఐ అబ్దుల్‌కీరం, ఎస్ఐ పి.జిలానిబాషాలు దర్యాప్తు మొదలు పెట్టారు. ఫిర్యాదుదారు భార్య ఇచ్చిన అసంబద్ధ వివరాలు వీరిలో అనుమానాలు కలిగించాయి. దీంతో ఆమె ఫోన్ కాల్ డేటా సేకరించారు. ఆమె స్వస్థలమైన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో విచారణ చేపట్టారు. ఇక్కడ తీగలాగితే డొంక కదిలింది. ఇండోర్‌లోని సిల్వర్‌నగర్‌కు చెందిన రమీజ్‌షా అనే వ్యక్తితో పూజకు వివాహేతర సంబంధం వున్నట్లు, వీళ్ళిద్దరూ పారిపోయి పెళ్లి చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు గుర్తించారు. నవంబర్ 29వ తేదీన రంజిత్‌కు అతని స్నేహితుడు శంకర్ 1500 గ్రాముల బంగారు వస్తువులు ఇచ్చి ఇంట్లో భద్రపరచమన్నాడు. రంజిత్ ఆ వస్తువులను పూజకు ఇచ్చి ఇంట్లో దాచమన్నాడు. ఈ బంగారాన్ని చూసిన పూజ ప్రియుడితో కలిసి స్కెచ్ వేసింది. రమీజ్‌షాతో దొంగతనం నాటకం ఆడించింది. తనకు తాను శరీరానికి గాయం చేసుకుంది. ఈ నెల 13న పూజను, ఆమె ప్రియుడు రమీజ్‌షాను నెల్లూరు రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి 1270గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అత్యంత చాకచక్యంగా ఈ కేసును శోధించి ఛేధించిన సిఐ కరీం, ఎస్ఐ జిలానిబాషా, వన్‌టౌన్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# 'నిద్రిత నయనాలు' ఆవిష్కరణ



ఈ నెల 11వ తేదీన నెల్లూరు, ఇందిరాభవన్‌రోడ్డులోని వంశీ నర్సింగ్‌హోమ్ సమావేశ మందిరంలో డాక్టర్ పెళ్ళకూరు జయప్రద రచించిన 'నిద్రితనయనాలు' కథాసంపుటిని జిల్లా రెండో జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు హనుమారెడ్డి, ప్రముఖ రచయిత్రి వి.ప్రతిమలు ఈ కథాసంపుటి విశేషాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత సాహితీవేత్త తిప్పావఝుల సుబ్రహ్మణ్యంకు సోమిరెడ్డి జమున స్మారక సాహితీ అవార్డును ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి వెంకట శేషారెడ్డి, చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, డాక్టర్ ఈదూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహ నియంత్రణతో...

# సంపూర్ణ ఆరోగ్యం

### - నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్




రోజురోజుకు పెరుగుతున్న మధుమేహ వ్యాధిని నియంత్రించేందుకు డాక్టర్లు తమవంతు కృషి చేయాలని నెల్లూరునగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రైమ్ మెడికల్ సొసైటి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని మినర్వా గ్రాండ్ హోటల్లో డయాబెటిస్, ఎండోక్రైన్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో 25 నుంచి 30శాతం వరకు మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉండటం విచారకరమన్నారు. డాక్టర్లు గ్రామాలు, పాఠశాలలకు వెళ్లి ప్రజలకు, విద్యార్థులకు డయాబెటిక్ క్యాంపులు నిర్వహించి వ్యాధి రాకుండా అవగాహన కల్పించాలని కోరారు.

అనంతరం షుగర్‌వ్యాధి పరిస్థితిపై నెల్లూరుతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు చర్చించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, షుగర్‌వ్యాధి నిపుణులు సత్యనారాయణమూర్తి, విజయ్, రామ్మోహన్, డాక్టర్ సుధాకర్, జిల్లాలోని పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

# మన పంతంతోనే అవినీతి అంతం

### - ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్‌రావు




ప్రజలు పంతం పడితేనే అవినీతి అంతమవుతుందని ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని ఆదిత్య కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహించిన అవినీతి వ్యతిరేక వారోత్సవాలలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అవినీతిని ప్రతిఒక్కరూ ప్రశ్నించినప్పుడే దాని పతనం ప్రారంభమవుతుందన్నారు. సమాజపురోభివృద్ధికి అవినీతి ప్రతిబంధకంగా మారిందని, అవినీతి నిర్మూలనలో ప్రజలు, విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అవినీతిని అంతం చేస్తే ప్రపంచంలోనే భారతదేశం అగ్రగామిగా నిలుస్తుందని ఆయన తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ఆచార్య ఆదిత్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షులు సీతారామరావు, బొగ్గవరపు రాధాకృష్ణ, దశరథరామిరెడ్డి, గోవింద్, నాగిరెడ్డి, మహీధర్, పవన్, శైలజ, సుదర్శన్, అనూష, సాయిజ్యోతి, శ్రీనివాసులు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## టిటిడి కళ్యాణ మండపానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న చదలవాడ కృష్ణమూర్తి, ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తదితరులు

గూడూరు పట్టణంలో తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 10వ తేదీ రూ. 1.70 లక్షలతో ఆధునిక హంగులతో నిర్మాణం చేయనున్న కళ్యాణ మండపానికి తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక పాశ్చాత్య పోకడలకు పోయి అనారోగ్యానికి గురికాకుండా అందరూ దైవభక్తి కల్గి ఉండి అథ్యాత్మికత వైపు పయనించి కష్టపడితే ఏ రంగంలోనైనా విజయం సాధ్యమన్నారు. శ్రీవారి దర్శనానికి వస్తున్న యాత్రికులకు గత యాభై ఏళ్లుగా 'గేట్ వే ఆఫ్ తిరుమల'గా గూడూరు ప్రసిద్ధి చెందిందన్నారు. ఉత్తర భారతదేశానికి సంబంధించిన యాత్రికులు అధికంగా గూడూరు వైపు వస్తుండటంతో ఇక్కడి రైల్వేజంక్షన్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు శ్రద్ధ తీసుకున్నారని గుర్తు చేశారు. గూడూరు పట్టణంలో 5 భజన బృందాలు ఏర్పాటుకు ఒక్కొక్కదానికి రూ. 10లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గూడూరు అభివృద్ధికి టిటిడి ఛైర్మెన్ సహకారం అవసరమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన కోరగా అందుకు ఆయన తప్పక లభిస్తుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కౌన్సిలర్లు పులిమి శ్రీనివాసులు, చెంచురామయ్య, శివకుమార్, కృష్ణవేణి, గూడూరు క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు కె.మునిగిరీష్, టిటిడి అధికారులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# గణితం ఎంతో గొప్ప శాస్త్రం

## - ఎన్‌బికెఆర్‌లో ఘనంగా గణిత సిల్వర్ జుబ్లీ వేడుకలు




గణితం ఎంతో గొప్ప శాస్త్రమని, అన్ని శాస్త్రాలకంటే గణితం విశిష్టమైనదని పలువురు వక్తలు పేర్కొన్నారు. కోట మండలం, విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల మూడు రోజులపాటు గణిత సిల్వర్‌జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ మ్యాథ మ్యాటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ అసోసియేషన్ 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని గణిత జాతీయ సదస్సును కూడా నిర్వహించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొ.వీరయ్య ఈ సదస్సును ప్రారంభించారు. గణితశాస్త్రం అన్ని శాస్త్రాలతో ముడిపడివుందని, గణితశాస్త్రం సహకారంతో సాంకేతిక రంగం ఎంతో ముందంజ వేస్తోందని ఈ సదస్సులో పాల్గొన్న ప్రొ.బి.మహేశ్వరి అన్నారు. కళాశాల కరెస్పాండెంట్ ఎన్.రామ్‌కుమార్‌రెడ్డి, ప్రొ. అరుణాచలం పాల్గొని అసోసియేషన్ సావనీర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, గణితం జీవితాలను ఎంతో ఉన్నతస్థాయికి చేర్చగలదని, తన తండ్రి దివంగత నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి లెక్కల మాస్టారుగానే జీవితాన్ని ప్రారంభించి, ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారని అన్నారు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా సుమారు 150 మంది గణిత అధ్యాపకులు, గణిత మేధావులు విచ్చేశారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడురోజుల పాటు జరిగిన ఈ గణిత వేడుకల్లో చివరి రోజైన ఆదివారం నాడు జరిగిన ముగింపుసభలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.సి రావుజీ మాట్లాడుతూ, గణితశాస్త్రం విద్యార్థుల భవితను తీర్చిదిద్దుతుందని, తరగతి గదిలో మాస్టార్లు గణితశాస్త్రం చెప్తున్నప్పుడు విద్యార్థులు శ్రద్ధగా వింటే, గణితం భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. గణితశాస్త్ర అధ్యయనంతో ఇతర శాస్త్రాలు కూడా సులువుగా అర్ధమవుతాయన్నారు. ఈ వేడుకలకు తరలి వచ్చిన గణిత మేధావులకు, అధ్యాపకులకు ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి చేతులు మీదుగా సర్టిఫికెట్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ డా. ఎస్.రవికుమార్, పి.విజయజ్యోతి తదితరులు పాల్గొన్నారు.




## సునీతా సేవాసంస్థ ఆధ్వర్యంలో

## మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సు




మాట్లాడుతున్న జడ్జి సాయిరాం, పక్కన సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి

పౌర హక్కులను ఎవరు కాలరాసినా కఠినంగా చర్యలు తీసుకుంటామని గూడూరు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కె.పి.సాయిరాం అన్నారు. ఈ నెల 10వతేదీ గూడూరు పట్టణం, బజారువీధిలోని సునీతా సేవాసంస్థ ఆధ్వర్యంలో మండల న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సాయిరాం మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన పౌరహక్కులను పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, కార్యదర్శి సులక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

## సీపీఎం పాదయాత్ర




ప్రజాసమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ అన్నారు. గూడూరు పట్టణంలో ఈ నెల 10న ప్రజా సమస్యలను గుర్తించే కార్యక్రమంలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్రను నిర్వహించారు. వామపక్ష నాయకులు ఎర్రజెండాలను చేతపట్టి అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందలా అంటూ పురవీధుల్లో పాదయాత్ర చేశారు. ఏం కొనేటట్లు లేదు, ఏం తినేటట్లు లేదు, నిత్యావసర ధరలు ఆకాశం అంటుతున్నాయంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, యాదగిరి, ముత్యాలయ్య, కేశవులు, రమణయ్య, శంకరయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ హెల్పేజ్ ఆధ్వర్యంలో

## వృద్ధులకు సరుకులు

వృద్ధులకు అవాస దశలో ఉన్న సమయంలో ఆదుకోవడం అభినందనీయమని రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగసూరి గోపాలరావు అన్నారు. గూడూరు పట్టణంలోని రోటరీక్లబ్‌లో ఈ నెల 10వ తేదీ రోటరీ హెల్పేజ్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కె.సుందరరామిరెడ్డి, దశరథరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, కె.మునిగిరీష్, కార్యదర్శి హరిప్రసాద్, నాగేంద్రప్రసాద్, దయాకరరెడ్డి, మునిరాజా, రత్నం, మోహన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



హనుమద్వ్రతము సందర్భంగా గూడూరు పట్టణంలోని మాలవ్యా నగర్‌లో శ్రీరామ రక్ష కుటీరంలో సోమవారం ఆంజనేయుడికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతినిధులు చిట్టిబాబు, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# వాకర్స్ అసోసియేషన్లకు అవార్డుల పంట






వాకర్స్ ఇంటర్నేషనల్ బెస్ట్ లీడర్‌షిప్ అవార్డును నెల్లూరుకు చెందిన ఎం.వి.సుబ్బారెడ్డి అందుకున్నారు. ఈమేరకు సోమవారం సుబ్బారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ 20ఏళ్లుగా వివిధ హోదాల్లో వాకర్స్ అసోసియేషన్‌కు విశిష్ట సేవలు, సామాజికంగా సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. మహాత్మాగాంధీ ఫెలోషిప్‌లను ఎక్కువుగా నమోదు చేయించినందుకు ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ సిల్వర్ జూబ్లీ కన్వెన్షన్‌లో బెస్ట్ లీడర్‌షిప్ అవార్డును వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు కృష్ణకుమారి అందజేసినట్లు తెలిపారు.

### విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు

హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ బెస్ట్ క్లబ్ అవార్డుతో పాటు ప్రోత్సాహకంగా రూ. 15వేల నగదు బహుమతిని విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్‌కు ప్రకటించారు. మంగళవారం నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో జరిగిన ఓ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీగవర్నర్ యం.వి.సుబ్బారెడ్డి, విఆర్‌సి వాకర్స్ అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డికి ఈ అవార్డు అందజేశారు. అలాగే బెస్ట్ సెక్రటరీ అవార్డును వి.వి. రమణమూర్తికి అందజేశారు.

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శరీరానికి స్వల్ప గాయాలు తగలవచ్చును. లేదా కొద్దిపాటి అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులకు సమర్ధత గౌరవం బాగుంటుంది. అధికారులకు స్థాన మార్పులుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరులకు ఆర్ధికంగా సహాయం చేస్తారు. వృత్తి పరంగా ఆదాయం బాగుంటుంది. వ్యాపార వర్గాలకు ఆటంకాలు తొలగి అభివృద్ధి బాగుంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దైవ, సమాజ సేవ కార్యక్రమాలలోను, సభలు సమావేశాలలోను పాల్గొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు కొనసాగుతాయి. విద్యార్ధులకు మంచి అవకాశాలు, విలువైన వస్తుసామాగ్రి కొనడం జరుగుతుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుండటం, అధికారవర్గ సహకారముంటుంది. వృత్తి వ్యాపారాలు, లభించే ఆదాయం తృప్తికరంగా ఉంటుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు పనిభారం, అధికారులకు స్థానమార్పు లుంటాయి. కొత్త యంత్రాలు, గృహోపకరణాలు కొంటారు. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. ప్రముఖులతో పరిచయాలు, శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం, అనుభవం లభిస్తుంది. పనులు చేపట్టినవి నిదానంగా జరుగుతాయి.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

విలువైన వస్తువులు సమకూరుతాయి. రావలసిన బాకీలు కొంత చేతికందవచ్చు. కోర్టు కేసులందు అనుకూలత, సభలు సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరించడం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం, విద్యావకాశాలు బాగుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ప్రముఖులను కలుసుకుంటారు. న్యాయ, వైద్య, సాంకేతిక, శాస్త్ర పరిశోధన రంగాల వారికి ప్రోత్సాహముంటుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 16.12.2016 నుండి**
**తేది. 22.12.2016 వరకు**

ఈ వారము కర్కాటకసింహ కన్యారాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, ధనుస్సులో రవిబుధులు, మకరంలో శుక్రుడు, కుంభంలో కేతువు కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము:

ధనుర్మాసారంభము.

**ముహూర్తములు**

తేది 16 శుక్రవారము ఉదయం గం. 8.50 నుండి గం. 10.30 లోగా మకర లగ్నమున వ్యాపార వివాహములు. తేది 22 గురువారము ఉదయం గం. 8.15 నుండి గం. 10.15లోగా మకర లగ్నమున వ్యాపార ఉపనయన, అన్నప్రాశన అక్షరాభ్యాస వివాహములు.

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | శుక్ర | తదియ | రా॥ గం.12.34వ॥ |
| తేది. 17 | శని | చతుర్థి | రా॥ గం.11.23వ॥ |
| తేది. 18 | ఆది | పంచమి | రా॥ గం.10.32వ॥ |
| తేది. 19 | సోమ | షష్ఠి | రా॥ గం.10.11వ॥ |
| తేది. 20 | మంగళ | సప్తమి | రా॥ గం.10.24వ॥ |
| తేది. 21 | బుధ | అష్టమి | రా॥ గం.11.03వ॥ |
| తేది. 22 | గురు | నవమి | రా॥ గం.12.17వ॥ |

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పెడతాయి. కోర్టు వ్యవహారాలలో అసంతృప్తి, బాకీలు నిలబడిపోవడం జరుగుతుంది. ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరుకుతాయి. కుటుంబంలో చిన్నచిన్న సమస్యలుండి బాధ కలుగుతుంది. వృత్తి వ్యాపార నిర్వహణలో సంతృప్తి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. అనవసర ఖర్చులు పైనబడగలవు.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ముఖ్యపత్రాలు, వస్తువులు పోగొట్టుకొనకుండా జాగ్రత్త పడాలి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారు మరికొద్ది కాలం నిరీక్షించవలసి ఉంటుంది. సోదరులకు మేలు జరుగుతుంది. కుటుంబసౌఖ్యం కలదు. పలుకుబడి పెంచుకొనడానికి, అనుకున్న పనులు నెరవేరడానికి ఆడంబరాలకు ఖర్చులు పెరిగి ఋణం చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయముంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బిడ్డల విద్య విషయంలో కొద్ది ఆందోళన ఉంటుంది. వివాహ ప్రయత్నాలు అనుకూలించగలవు. ఉద్యోగులకు అధికారులతో సామరస్యంగా బాగుంటుంది. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి. పారిశ్రామికవర్గాలకు, కాంట్రాక్టర్లకు వర్కర్లతో సమస్యలు రాగలవు. ఆరోగ్యం బాగుంటుంది. ఇతరులు మీపై చేసిన విమర్శలు, నిందలు సర్దుబాటు కాగలవు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

స్థిరాస్తులు వృద్ధి పరుచుకునే ప్రయత్నాలు చేస్తారు. విద్యార్థులకు మంచి అవకాశాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. అనుకోని ప్రయాణాలు, ఇతరులకు ఆర్థికంగాను, పనులందు సహాయపడటం జరుగుతుంది. ఉద్యోగులకు సమర్ధత, గుర్తింపు బాగుంటుంది. ఆర్ధికంగా బాగుండి వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగులకు సమర్ధత ఉండి పనిభారం పెరుగుతుంది. నిర్మాణాలు చేసేవారికి పనివారితో ఇబ్బందులుంటాయి. హోల్‌సేల్ వ్యాపారాలు బాగా జరుగుతాయి. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. దూర ప్రయాణాలుండును. ఆరోగ్యం బాగుంటుంది. చేపట్టిన పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఏదో విధంగా పనులు జరుపుకుంటారు. కోర్టు వ్యవహారాలు అసంతృప్తిని కలిగిస్తాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్య నిర్ణయాలు వాయిదా పడగలవు. అనుకోని ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు స్థానమార్పు, పనిభారం పెరగడం ఉంటుంది. ఆస్తి వ్యవహారాలు, రావలసిన డబ్బులు కొంత పరిష్కారం కాగలవు. కుటుంబ, ఆర్థిక, ఉద్యోగ వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండాలి. సన్నిహితులు బంధువుల వల్ల సమస్యలు రాగలవు. వ్యాపార అవకాశాలు తగ్గుతాయి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ముఖ్య వ్యక్తులను కలుసుకొనలేక పోవడం, అనుకోని ప్రయాణాలు చేయవలసి రావడం ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. ఉద్యోగులకు మంచి గుర్తింపు గౌరవాలు, రావలసిన బాకీలు కొంత లభించడం జరుగుతుంది. విద్యార్థులకు మంచి ఉన్నత విద్యావకాశాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులు ఇతరులతో జాగ్రత్తగా మెలగవలసి ఉంటుంది. పనులందు టెన్షన్ ఉంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. శుభకార్య ప్రయత్నాలు వేగవంతం కాగలవు. బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబ సమస్యలు, ఉద్యోగ నిర్వహణలో సమస్యల వల్ల ఇబ్బందులు పడతారు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి.

# బ్లాక్‌మనీ కోసం బాబు సూపర్ స్కెచ్

శ్రీను గల్పిక

ఢిల్లీలోని టెన్‌జనపథ్... కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలతో అక్కడంతా అట్టహాసంగా వుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులందరూ పుష్ప గుచ్ఛాలతో సోనియాకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వచ్చిన అతిథులందరికీ వి. హెచ్. హనుమంతురావు, రేణుకాచౌదరి, మధుయాష్కీలు స్వీట్లు, కాఫీ అందిస్తున్నారు. అయితే వచ్చిన వాళ్లంతా కూడా వంద రూపాయల్లోపు ఖరీదు చేసే బొకేలే తెస్తున్నారు గాని, వేలు, లక్షలు ఖరీదు చేసే వివిధ రకాల గజమాలలు, ముత్యాల దండలు తేవడం లేదు. అది గమనించిన రాహుల్ తన తల్లితో... చూడమ్మా, అధికారం లేకపోయేసరికి వీళ్లకు మనం అలుసైపోయాము. ఇంతకుముందు మీ బర్త్‌డే అంటే గజమాలలు తెచ్చే వాళ్లు, భారీ ఎత్తున బాణాసంచా కాల్చే వాళ్లు. 2జీ స్పెక్ట్రం, బొగ్గు, హెలికాప్టర్‌ల డబ్బులు వేలకోట్లు దిగమింగి వెయ్యి రూపాయల దండ తేవడానికి కక్కుర్తి పడుతున్నారు. ఇలాంటి వాళ్ళ కోసమేనా మనం మన పార్టీని స్కాములకు కేరాఫ్ అడ్రస్‌గా చేసింది అని బాధపడసాగాడు. అందుకు సోనియా... మనవాళ్ళను అపార్ధం చేసుకోకు రాహుల్... వాళ్ల అభిమానంపై ఆవగింజంత అనుమానం పెట్టుకోకు... పెద్దనోట్ల రద్దు దెబ్బకు ఇప్పుడు ఎవరి వద్దా డబ్బులు లేవు. ఇప్పుడు కూడా వీళ్లు ఇంటి అవసరాలు తగ్గించుకుని నా కోసం ఈ బొకేలు తెచ్చుంటారు. ఆ మోడీ పుణ్యాన ఎవరు మాత్రం సుఖంగా ఉన్నారు చెప్పు అని అంది. మామ్... నాకు ప్రధాని అయ్యే అవకాశముందంటారా అని రాహుల్ ప్రశ్నించాడు. మొన్నటిదాకా నాకు నీపై నమ్మకముండేది కాదు. కాని, ఇప్పుడెందుకో నమ్మకం కలుగుతోంది. నేను నరేంద్రమోడీని పెద్ద మేధావి, అతని నుండి ఇక మనకు అధికారం రావడం కష్టమనుకున్నాను. కాని, మనలా మోడీకి ఓట్ల బ్యాంకు రాజకీయాలు తెలియదని అర్ధమైంది. మనం మొదటి నుండి రూపాయి అవసరమయ్యే వాడికి రూపాయే ఇస్తాం, వంద అవసరమైన వాడికి వందిస్తాం... కాబట్టి ఇద్దరూ మనతో ఉండేవాళ్లు. అందుకే 60 ఏళ్లు మనం ఈ దేశాన్ని పరిపాలించగలిగాం. కాని, మోడీ వట్టి అమాయకుడు. రూపాయి అవసరమైన వాడికి, వంద అవసరమైన వాడికి... ఇద్దరికీ 50రూపాయలు ఇవ్వాలనుకున్నాడు. ఆ ప్రయత్నంలో వంద వాడిని 50కి తెచ్చాడుగాని, రూపాయి వాడిని 50కి తీసుకుపోలేకపోయాడు. భారతదేశమంటేనే ఓట్ల బ్యాంకు లెక్కల సమాహారం. ఈ లెక్కలు తెలియక మోడీ బోర్లాపడ్డాడు. పెద్దనోట్ల రద్దు ఒక రకంగా నీ మంచికే నాయనా, అని సోనియా చెప్పింది. దాంతో రాహుల్ ఎంతో ఆనందంగా సైకిల్ తొక్కుకుంటానని చెప్పి వెళ్లిపోయాడు.

★ ★ ★ ★ ★

ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోడీ కేంద్రమంత్రులు మనోహర్ పారికర్, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు, సురేష్ ప్రభు, అనంత కుమార్, ప్రకాష్ జవదేకర్, స్మృతి ఇరానీలు కూర్చుని వున్నారు. ఆ గదంతా కూడా చీకటిగా వుంది. లైట్లు వేయకూడదా అని వెంకయ్య అడిగాడు. కరెంట్ లేదని మోడీ చెప్పాడు. ఈ కాలంలో కూడా పవర్‌కట్టా అని వెంకయ్య అన్నాడు. కాదు... పవర్ కట్ చేసారని మోడీ అన్నాడు. అదేంటి, ప్రధాని కార్యాలయానికే కరెంట్ కట్ చేయడమేంటి, బిల్ కట్టలేదా అని వెంకయ్య ప్రశ్నించాడు. పెద్దనోట్ల రద్దు రచ్చలో పడి కరెంట్ బిల్లు కట్టడం మరచిపోయాము... తీరా నిన్న చూస్తే ఆఖరి రోజు. బిల్లు కట్టమని పాత నోట్లు పంపిస్తే తీసుకోలేదు. సమయానికి మన వద్ద కొత్త నోట్లు కూడా లేవని మోడీ చెప్పాడు. దేశంలో నల్ల కుబేరుల వద్ద కోట్ల కొద్ది కొత్త కరెన్సీ కట్టలున్నాయి. మనం మాత్రం ముందు జాగ్రత్త చర్యగా కొన్ని కొత్త నోట్లన్నా పెట్టుకోలేకపోయాము అని వెంకయ్య నిట్టూర్చాడు. ఇంతకీ పెద్దనోట్లు రద్దుపై ప్రజలేమనుకుంటున్నారని మోడీ అడిగాడు. పారికర్ వుండి... నా మటుకు హాయిగా వుంది, కాశ్మీర్‌లో అల్లర్లు ఆగిపోయాయి. ఇక నా వ్యక్తిగతంగా అంటారా... పెద్దనోట్లు వున్నా ఒకటే లేకున్నా ఒకటే... అసలు నా దగ్గర డబ్బులు లేకున్నా ఒకటే అని చెప్పాడు. అరుణ్‌జైట్లీ వుండి... పెద్దనోట్ల రద్దు వల్ల పేదలు, పెద్దలు అంతా ఒకటే అయ్యారు సారు, సమతాభారత్ అంటే ఇదేనేమో! స్టార్ హోటళ్లు, ఫుడ్‌కోర్టులకు పోయి కాస్ట్‌లీ తిండి తినేవాళ్లు తగ్గిపోయారు. అందరూ కాకా హోటళ్లకే పోతున్నారు. మల్టీప్లెక్స్‌లకు పోకుండా నాన్ ఏ.సి పాతకాలం థియేటర్లకే సినిమాలకు పోతున్నారు. ఎవరూ ఆడి, బెంజి కార్ల జోలికి పోవడం లేదు. బాగా బలిసినోళ్లు కూడా మారుతి 800, అంబాసిడర్ కార్లు కొంటున్నారు. ఇంకొందరైతే గుర్రపు బండ్లు కూడా ప్లాన్ చేసుకుంటున్నారు. ఇక పెళ్ళిళ్ళలో ఖర్చు చూడాలి... ఇంతకుముందు ప్లేట్ భోజనం వెయ్యి రూపాయలు, డెకరేషన్‌కు పాతిక లక్షలు, అంతా కాంట్రాక్ట్‌కిచ్చే వాళ్లు. పెద్దనోట్ల రద్దు తర్వాత పెళ్ళిళ్ల వద్ద భోజనాలు, పెళ్లి పందిర్లు బంధుమిత్రులే వేస్తున్నారు. 50లక్షల్లో చేసే పెళ్లి, ఇప్పుడు 5లక్షల్లో అయిపోతుందని చెప్పాడు. నువ్వేమంటావు వెంకయ్యా అని మోడీ అడిగాడు. పెద్దనోట్ల రద్దు ఎఫెక్ట్ నా మీద ఏమీ వుండదు సార్, ఎందుకంటే నా జీవితంలో వెయ్యి నోటును రెండుసార్లు, ఐదొందల నోటును నాలుగుసార్లు చూసివుంటాను, అది కూడా నా పుట్టినరోజుకు బట్టలు కొనుక్కోమని మా హర్ష, మా దీప ఇచ్చారు కాబట్టి ఆ నోట్లను చూడగలిగాను అని చెప్పాడు. వెంకయ్య చెప్పింది విని అందరూ ఆశ్చర్యపోయారు. అంతలో ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్‌పటేల్ అక్కడకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. మోడీతో ఆయన సార్, మన అంచనాలు తప్పవుతున్నాయి. మొత్తం పెద్దనోట్లు 14.50లక్షల కోట్లుండగా అందులో 10లక్షల కోట్లు మాత్రమే బ్యాంకులకు వస్తాయనుకున్నాం. మిగిలిన డబ్బంతా మనదేననుకున్నాం. కాని ఇప్పటికే 12లక్షల50వేల కోట్ల దాకా వచ్చాయి. ఇంకా 20రోజుల గడువుంది. ఆ మిగతా డబ్బులు కూడా వస్తే మన ప్లాన్ అట్టర్‌ఫ్లాప్ అవుతుందన్నాడు. ఆ మాటతో మోడీ ముఖం మాడిపోయింది. అక్కడున్న అందరిలోనూ ఆదుర్దా మొదలైంది. కనీసం రెండు లక్షల కోట్లన్నా బ్లాక్‌మనీ తేల్చుకుంటే మన పరువు పోతుందని మోడీ అన్నాడు. అప్పుడు వెంకయ్య... ఇలాంటి వాటిని మోయడానికి పాపాల భైరవుడు ఒకరు కావాలి. పెద్దనోట్ల రద్దును సమర్ధించిన పాపానికి హైటెక్‌రత్న చంద్రబాబుకు నగదు రహిత లావాదేవీల కమిటీ ఛైర్మెన్ పదవిని అంటగట్టాం. దీంతో అతని తంటాలు అతను పడుతున్నాడు. దీనికి కూడా ఏదన్నా సొల్యూషన్ చెబుతాడు. అతనిని పిలిపిస్తాం అని చెప్పి వెంటనే చంద్రబాబుకు ఫోన్ చేసి ఢిల్లీకి రమ్మని చెప్పాడు.

రెండు గంటల తర్వాత చంద్రబాబు ప్రధాని కార్యాలయంలో వాలిపోయాడు. వెంకయ్య సమస్యను చెప్పాడు. కనీసం రెండు లక్షల కోట్లు బ్యాంకులకు రాకుండా ఆగిపోయే మార్గం చెప్పమన్నాడు. అది వినగానే చంద్రబాబు ఏ మాత్రం ఆలోచించకుండా... ఈ మాత్రం దానికేనా నన్ను హడావిడిగా పిలిపించింది... ఫోన్‌లోనే అడిగి వుంటే చెప్పే వాణ్ణి కదా... వెరీ సింపుల్... కొత్త నోట్ల పంపిణీలో బ్యాంకుల ద్వారానే అక్రమాలు జరిగాయి. దేశంలోని అన్ని బ్యాంకులపై సిబిఐ, ఏసిబి, ఈడి ఎంక్వైరీలు వేయించండి... ముందు ఓ 500మంది బ్యాంకు ఉద్యోగులను సస్పెండ్ చేయండి... వెంటనే అన్ని బ్యాంకు ఉద్యోగ సంఘాలు నిరవధిక సమ్మెకు దిగుతాయి. వాళ్లు బ్యాంకుల బయట ఉంటారు. కాబట్టి, ఎలాగూ బ్యాంకుల్లో డిపాజిట్లు తీసుకోరు... ఈ నెల 30దాకా వాళ్లు సమ్మె చేస్తే చాలు... ఎలాగూ మనం కూడా అప్పటిదాకా వాళ్ల డిమాండ్లకు తలొంచకుండా సమ్మెకు దిగిన వారిలో కూడా కొందరిని సస్పెండ్ చేద్దాం. బ్యాంకులు మూతపడితే ఇక ఎక్కడి డబ్బు అక్కడ ఆగిపోవాల్సిందే కదా! ఎలాగూ ఈ నెల 30వ తేదీ తర్వాత ఆ డబ్బు చెల్లదు. ఈ విధంగా రెండు లక్షల కోట్లు దాకా నిలిచిపోతుందని చెప్పాడు. బాబు స్కెచ్‌కు అక్కడున్న నాయకులందరికీ దిమ్మ తిరిగింది. పెద్దనోట్ల రద్దు చేసినోడు కాదురా గొప్పోడు... ఆ గండం నుండి బయటేసినోడు గొప్పోడు అన్నట్లుగా వారంతా చంద్రబాబు వైపు అభిమానంగా చూసారు.

# నెల్లూరు ప్రొఫెసర్‌కు ఇంగ్లాండ్ గుర్తింపు






వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తూ నెల్లూరీయులెందరో తమ ప్రతిభా పాటవాలను జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో చాటుతూనే వున్నారు. తాజాగా, నెల్లూరుకు చెందిన ప్రొఫెసర్ ఏ.వరదరాజులు ఇంగ్లాండ్‌లో ఎంతో విఖ్యాతమైన రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ వారి గుర్తింపు పొంది వైద్యవిజ్ఞాన రంగంలో సింహపురి సీమ కీర్తిబావుటాను రెపరెప లాడిస్తున్నారు. వైద్యశాస్త్రంలోనూ, ప్యాకేజీరంగంలోనూ ఉపయోగపడే 'మట్టిలో కలిసిపోయే పాలిమర్ కాంపోజిట్స్, నానో కాంపోజిట్ ఫిల్మ్‌'లపై ప్రొఫెసర్ వరదరాజులు ఎన్నో పరిశోధనలు చేస్తున్నారు. ఆ పరిశోధనలకు గుర్తింపుగా ఆయన్ను ఇంగ్లాండ్‌లో ప్రతిష్ఠాత్మకమైన 'ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ'గా ఎంపికచేసి గౌరవించడం విశేషం. ఇంగ్లాండ్ మహారాణి ప్యాట్రన్‌గా వ్యవహరించే ఈ సంస్థను ఇంగ్లాండ్‌లో 1841లో స్థాపించారు. ప్రపంచవ్యాప్తంగా కెమిస్ట్రీలో జరిపే విశిష్టమైన పరిశోధనలకు ఈ అరుదైన గుర్తింపు లభిస్తుంది. ప్రొఫెసర్ వరదరాజులు ప్రస్తుతం తమిళనాడులోని మధురై సమీపంలో వున్న కృష్ణన్‌కోయిల్‌లో వున్న కలశలింగం విశ్వవిద్యాలయంలో ప్లాస్టిక్ పదార్థాలపై పరిశోధనలు జరిపే అంతర్జాతీయ పరిశోధనా కేంద్రంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 'మట్టిలో కలిసిపోయే ప్లాస్టిక్ పదార్థాలు-ఆగ్రో ప్లాస్టిక్స్'పై బ్రెజిల్, ఇంగ్లాండ్, మలేసియా దేశాల సహకారంతో ఇక్కడ జరుగుతున్న పరిశోధనలకు ఆయన నేతృత్వం వహిస్తున్నారు. నెల్లూరు వి.ఆర్.కాలేజీలో బిఎస్సీ చదివిన వరదరాజులు, తిరుపతి ఎస్వీయూలో ఎమ్మెస్సీ పిహెచ్‌డి పూర్తిచేసి అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1993లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది 2010లో ఉద్యోగ విరమణ చేసేవరకు పాలిమర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2012 నుంచి 2015 దాకా హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో సిఎస్ఐఆర్ ఎమెరిటస్ సైంటిస్ట్‌గా పనిచేశారు. ప్రస్తుతం తమిళనాడులోని కలశలింగం యూనివర్శిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా అవిశ్రాంత శాస్త్రవేత్తగా నిరుపమానమైన సేవలందిస్తున్నారు. ఇప్పటిదాకా జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో 'మట్టిలో కలిసిపోయే పాలిమర్స్' అంశంపై సుమారు 150 పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. హంగేరి, సోవియట్ యూనియన్, చైనా, నేపాల్, సౌత్‌కొరియా దేశాలను సందర్శించి అనేక అకడమిక్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి ఆహ్వానంపై 17 సార్లు చైనాలో పర్యటించి యునెస్కోవారి పథకాలను అమలుచేశారు. ప్రొఫెసర్ వరదరాజులు ప్రతిభాపాటవాలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2003లో ఉత్తమ ప్రతిభ ఉపాధ్యాయునిగా గుర్తించి సత్కరించింది. గ్రీన్ కెమిస్ట్రీ రంగంలో వరదరాజులు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయనను చైనీస్ కెమికల్ సొసైటీ సభ్యునిగా ఎన్నుకున్నారు. ఇప్పుడు మరెంతో విశిష్టమైన ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (ఎఫ్ఆర్ఎస్‌సి)గా విశిష్ట గుర్తింపు పొందడం ఎంతైనా విశేషం.

ఏదేమైనా, శాస్త్రసాంకేతిక రంగంలో తనదంటూ విశేషమైన ఖ్యాతితో అందరి ప్రశంసలు అందుకుంటున్న ప్రొఫెసర్ వరదరాజులు నెల్లూరీయుడు కావడం నెల్లూరుసీమకే గర్వకారణం. ఆయనకు 'లాయర్' శుభాకాంక్షలు!...

# కనువిందైన వస్త్రప్రపంచం... కళ్యాణమస్తు




మాగుంట లే-అవుట్‌లో త్వరలోనే ప్రారంభం

**నెల్లూరులో అద్భుతమైన షాపింగ్‌మాల్ త్వరలోనే ప్రారంభం కాబోతోంది. రంగుల హరివిల్లులాంటి ఆ వస్త్ర ప్రపంచం పేరే.. 'కళ్యాణమస్తు'. రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులో 'కళ్యాణమస్తు' ప్రారంభమవుతోంది. ఈ షాపింగ్‌మాల్‌ను ఈ నెలలోనే ప్రారంభించి వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు 'కళ్యాణమస్తు' అధినేత డాక్టర్ యశ్వంత్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారు.**

నెల్లూరులోని మాగుంట లే-అవుట్‌లో త్వరలోనే ప్రారంభానికి ముస్తాబవుతోంది. దాదాపు 24వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, విశాలమైన గదులతో, అయిదు అంతస్తుల భవనంలో అత్యద్భుతంగా రూపుదిద్దుకున్న 'కళ్యాణమస్తు' షాపింగ్‌మాల్.. ఈ నెలలోనే ప్రారంభం కాబోతోంది. ఎన్నెన్నో అపురూపమైన.. నాణ్యమైన వస్త్రాల సమాహారంగా 'కళ్యాణమస్తు' వుండబోతోందని కళ్యాణమస్తు యాజమాన్యం పేర్కొంటోంది. ముఖ్యంగా కళ్యాణాలకు, శుభకార్యాలకు.. పండుగలకు, బర్త్‌డే తదితర వేడుకల కోసం.. ఎన్నెన్నో రకాల వస్త్రాలు మనకు ఇక్కడ కనువిందు చేయనున్నాయి. వినియోగదారుల ఆకాంక్షలకు తగ్గట్టుగా వుండే... ఎన్నెన్నో అపురూపమైన డిజైన్లతో మనచెంతనే 'కళ్యాణమస్తు' వస్త్రప్రపంచం ఆరంభం కాబోతోండడం విశేషం. నేరుగా 'కళ్యాణమస్తు'కు విచ్చేస్తే చాలు.. ఎన్నోరకాలు, ముచ్చటైన డిజైన్లతో వుండే వస్త్రాలు మనల్ని ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా చిన్నారులు, యువతులకు, మహిళలకు అవసరమైన ఎంతో మన్నికైన.. నాణ్యమైన వస్త్రాలు ఇక్కడ కోకొల్లలుగా లభిస్తాయి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మంచి మేలైన పట్టుచీరలు కావాలంటే 'కళ్యాణమస్తు'కు విచ్చేస్తే చాలు. ఎంతో ఆకర్షణీయమైన డిజైన్లతో వుండే 'కళ్యాణమస్తు' పట్టు చీరలు ఇక అందరినీ బాగా ఆకట్టుకోబోతున్నాయి. కేవలం 6 వందల నుంచి 2 లక్షల రూపాయల దాకా ధర వుండే పట్టు చీరలు కూడా ఇక్కడ లభించనున్నాయి. ఇంకా అనేకరకాల వస్త్రాలు.. చుడీదార్స్, డ్రెస్ మెటీరియల్ ఇలా ఎన్నెన్నో రకాల వస్త్రాలు ఇక్కడ లభ్యమవుతాయి.

నెల్లూరీయులకు అందు బాటులో వుండేవిధంగా ఒక మంచి షాపింగ్‌మాల్ ఏర్పాటు చేస్తూ.. ప్రారంభానికి సిద్ధమవుతున్న 'కళ్యాణమస్తు'కు... శుభదీవెనలు. 'కళ్యాణమస్తు' యాజమాన్యానికి శుభాకాంక్షలు!

# వియాని చిన్నారులకు చేయూత



నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్ అధినేత గాదంశెట్టి శ్రీకాంత్ కుమార్తె స్మిథిత 5వ పుట్టినరోజును పురస్కరించుకుని 14వ తేదీ నెల్లూరు పొదలకూరురోడ్డులోని వియానీహోం విద్యార్థులకు దుస్తులు, మెడికల్ కిట్స్, చలికాలంలో వాడుకునేందుకు వీలుగా స్వెట్టర్స్ పంపిణీ చేశారు. అలాగే అక్కడే కేక్ కట్ చేసి విద్యార్థులకు కేక్‌లు, స్వీట్లు పంచిపెట్టారు. తన కుమార్తె స్మిథిత ప్రతి పుట్టినరోజునాడు కూడా ఇలా సేవా కార్యక్రమాలు చేయడం శ్రీకాంత్ ఆనవాయితీగా పెట్టుకున్నాడు. లయన్స్‌క్లబ్ ఆఫ్ లియో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లియో ఛైర్మెన్ చిన్నయ్య గుప్తా, పిఎస్ఆర్ రాము, వాసు, రామ్మూర్తి, లయన్స్‌క్లబ్ సభ్యులు, లియో క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టివిఎస్ కళ్యాణసదన్‌లో అభినందన సభ




నెల్లూరులోని శ్రీ తిప్పరాజు వేంకటసుబ్బయ్య ట్రస్ట్ కమిటీ ఛైర్మెన్‌గా నూతనంగా నియమితులైన డాక్టర్ పిఎస్ఆర్‌కె మూర్తి, కమిటీ అధ్యక్షునిగా నియమితులైన దేశభొట్ల ఫణిరత్నంలను ఆదివారం టివిఎస్ కళ్యాణసదన్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పిఎస్ఆర్‌కె మూర్తిని, ఫణిరత్నంలను అభినందించారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు, రాష్ట్ర కోశాధికారి కామేశ్వరప్రసాద్, జిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమితి అధ్యక్షుడు గుడ్డేరావు వాసుదేవరావు, ఉపాధ్యక్షులు కొట్రా సురేష్‌కుమార్, చిట్టమూరు శ్రీనివాసరావు, వేదపండితులు మాచవోలు రాజశేఖర శర్మతో పాటు స్థానిక ప్రముఖులు శనగవరపు సత్యనారాయణమూర్తి, డా.ఫణికృష్ణ, ఎల్‌వి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

# తుఫాను బాధితులకు సేవలు



వార్దా తుఫాను సమయంలో కురిసిన భారీ వర్షాలు, బలమైన గాలుల ప్రభావం చెన్నైతో పాటు ఏపిలో నెల్లూరు, ప్రకాశం జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపింది. భారీవర్షాల కారణంగా రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడే స్థంభించిపోయింది. సోమవారం రాత్రి బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో పాటలీపుత్ర, సంఘమిత్ర, కేరళ, జిటి, హౌరా తదితర సూపర్‌ఫాస్ట్ రైళ్ళు నిలిచిపోయాయి. సుదూర ప్రాంతాలనుండి వచ్చిన ప్రయాణీకులు ఇక్కడ ఇబ్బందులకు గురౌతున్న సమయంలో బోగోలు తహశీల్దార్ జయప్రకాష్, ఆర్డీఓ లక్ష్మీనరసింహంకు సమాచారమందించగా ఆయన సూచనల మేరకు కావలి తహశీల్దార్ సాంబశివరావు అల్పాహారాన్ని సమకూర్చారు. ప్రత్యేక అధికారి బాలాజీ నాయక్ పర్యవేక్షణలో కావలి రెడ్‌క్రాస్ విపత్తు నివారణ బృందం డి రవిప్రకాష్, బి లక్ష్మీనంద, కె ప్రీతమ్ శెట్టి, జి ప్రసన్నాంజనేయులు, టి మాల్యాద్రి, రాజశేఖర్‌లు వెంటనే స్పందించి రైళ్ళలోని సుమారు 800 మంది ప్రయాణీకులకు అల్పాహారం, పిల్లలకు పాలు అందజేశారు. విపత్కర సమయాలలో ప్రజలకు సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులను ఆర్‌డీఓ ప్రశంసించారు.

# సభ్యత్వ నమోదుకు చురుగ్గా పనిచేయాలి



కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ 2016-18సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నిర్దేశిత సంఖ్యను పూర్తి చేసేందుకు కార్యకర్తలందరూ చురుగ్గా పనిచేయాలని పట్టణ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం 21వ వార్డులో ఇన్‌ఛార్జి సన్నిగంటి భాస్కర్, కో ఆప్షన్ సభ్యులు షేక్ చెన్నయ్య ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటి వరకు 17600 మందిని క్రియాశీలక సభ్యులుగా చేర్పామన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి గుప్తా మాట్లాడుతూ పట్టణంలో 20వేల సభ్యత్వాలు చేయాలని నిర్దేశించారన్నారు. ఇప్పటికే 80శాతం సభ్యత్వాలు పూర్తి చేశామని, డిసెంబర్ 15లోపు టార్గెట్ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు మున్నా వెంకట్రావు, రాజ్‌కుమార్ చౌదరి, సుబ్బయ్య, నరసింహులు, మాలకొండయ్య, సంతోష్, మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరీ శేఖర్‌రెడ్డి



## బినామీనా... సునామీనా?

కరెన్సీ కట్టలు... కార్లలో కట్టలు... బాత్రూమ్‌లలో, బెడ్ రూమ్‌లలో కరెన్సీ కట్టలే... బంగారు కడ్డీలే! అతని ఇళ్లు బ్యాంకు కాదు, నగదు నిల్వ చేసే రిజర్వ్‌బ్యాంకు చెస్ట్ కాదు... మరి అతని వద్ద ఈ కరెన్సీ కట్టలేంటి... అది కూడా ఒక్క పాతవే కాదు, కొత్తవి కూడా! పేదోడు ఒక రోజంతా బ్యాంకుల ముందు నిలబడితే గాని రెండు వేల నోట్లు రెండు చేతికి రావడం లేదు. అలాంటిది... ఇతను ఏ బ్యాంకులో నిలబడకుండానే, ఏ ఏటిఎం సెంటర్‌కు పోకుండానే... ఇన్ని రెండు వేల నోట్లేంటి... ఒకటి కాదు రెండు కాదు... కోట్లాది రూపాయల కొత్తనోట్ల కరెన్సీ కట్టలు.

శేఖర్‌రెడ్డి... టీటీడీ బోర్డు మెంబర్. ఈ పదవిలో వున్నా అతని గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. చంద్రబాబు కొలువులో 'రెడ్డి'ని టీటీడీ బోర్డులోకి తీసుకోవడం, అది కూడా తమిళనాడు ప్రాంతం నుండి తీసుకోవడం చాలా సాధారణంగా భావించారు. ఏదో సిఫారసు మీద ఇచ్చుంటారులే అని అనుకున్నారు.

కాని గత వారంరోజులుగా ఈ శేఖర్‌రెడ్డి అంటే ఏంటి, అతని శక్తేంటి, అతని కథేంటి, అతని బ్యాక్‌గ్రౌండ్ ఏంటి... అనేది జనాలకే అంతు బట్టడం లేదు. అతని ఇంట్లో, కార్లలో, బాత్‌రూమ్‌లలో బయటపడ్డ కొత్త, పాత కరెన్సీ కట్టలు, బంగారు కడ్డీలను చూసి ఐటి అధికారులే గుడ్లు తేలేస్తున్నారు. శేఖర్‌రెడ్డి ఇంటిపై, అతని బంధువుల ఇళ్ళపై ఐటి చేసిన దాడుల్లో దాదాపు 200కోట్ల పాత, కొత్త కరెన్సీ కట్టలు, కోట్ల రూపాయల విలువచేసే బంగారు కడ్డీలు బయటపడ్డాయి.

తమిళనాడులోని కట్పాడి శేఖర్‌రెడ్డి వుండే ఊరు. ఆ రాష్ట్రం మొత్తం ఇసుక లైసెన్స్ ఇతనిదే! ఈ ఇసుక వ్యాపారంలోనే నెలకు కోట్లలో ఆదాయముంటుంది. నెలకు 50కోట్ల దాకా ప్రభుత్వ పెద్దలకు చెల్లించాలన్నది కూడా సమాచారం. తమిళనాడు ప్రభుత్వంలో చాలా పలుకుబడి కలిగిన వ్యక్తి అతను. పోయెస్ గార్డెన్‌లోకి నేరుగా వెళ్లేవాడు. ప్రభుత్వంలో ఎటువంటి పని కావాలన్నా చిటికెలో చేసుకొచ్చేవాడు. ఒక కోణంలో ఇసుక వ్యాపారంలో శశికళ, ఇతను భాగస్తులనే ప్రచారం కూడా వుంది.

### కొండేపాటికి మిత్రుడు

నెల్లూరుకు చెందిన ఒకనాటి లిక్కర్ వ్యాపారి, ప్రస్తుతం బిల్డర్, కాంట్రాక్టర్ అయిన కొండేపాటి గంగాప్రసాద్‌తో శేఖర్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలున్నట్లు తెలుస్తోంది. గంగాప్రసాద్‌కు తమిళనాడులో పలు కాంట్రాక్ట్ పనులు దక్కేలా చేసింది శేఖర్‌రెడ్డే! అలాగే నెల్లూరుజిల్లా సరిహద్దు నుండి చెన్నై దాకా జాతీయ రహదారి ఆరులైన్ల విస్తరణ కాంట్రాక్ట్ కూడా గంగా ప్రసాద్‌దే! అయితే ఈ పని నత్తనడకన నడుస్తూ వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. ఈ మార్గంలో ఫ్లై ఓవర్‌లను ఇంతవరకు పూర్తి చేయలేదు. ఆరులైన్ల విస్తరణ పనులు చాలాకాలం నుండే జరుగుతున్నా, ఇంతవరకు ఒక రూపు రాలేదు. ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. ఇంత అధ్వాన్నంగా పనులు చేస్తుంటే ఇంకో కాంట్రాక్టర్‌నైతే ప్రభుత్వం ఎప్పుడో బ్లాక్‌లిస్టులో పెట్టుండేది. కాని తమిళనాడు ప్రభుత్వంలో శేఖర్‌రెడ్డి చక్రం తిప్పుతుండడం వల్ల గంగాప్రసాద్‌కు ఆ భయం లేకుండాపోయింది. శేఖర్‌రెడ్డి అభయం దొరికింది.

శేఖర్‌రెడ్డి పట్ల వున్న కృతజ్ఞతాభావంతోనే ఆయనను టీటీడీ పాలకమండలిలో సభ్యుడిగా నియమించేందుకు గంగాప్రసాద్ తన పరపతిని ఉపయోగించినట్లు తెలుస్తోంది. తెలుగుదేశంపార్టీలో ఒకప్పుడు సీనియర్ నాయకులు, ప్రజల్లో పలుకుబడి వున్న నాయకుల మాటకు విలువ వుండేది. ఇప్పుడు కార్పొరేట్లు, కాంట్రాక్టర్లు, మధ్యవర్తుల మాట చెల్లు బాటవుతోంది. ముఖ్యంగా డబ్బుకు తెలుగుదేశం దాసోహం అంటోంది. కాబట్టే నెల్లూరు జిల్లాలో ఎలాంటి పరపతి లేకున్నా, పార్టీకి పదిఓట్లు తెచ్చే కెపాసిటీ లేకున్నా గంగాప్రసాద్ తన బంధువు గరికపాటి రామ్మోహన్‌రావుకు రాజ్యసభ తెచ్చుకోగలిగాడు. తన వియ్యంకుడు గురవయ్య నాయుడును శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఛైర్మెన్‌గా, తన బావమరిది తానంకి నానాజీని పెంచలకోన దేవస్థానం ఛైర్మెన్‌గా నియమించుకోగలిగాడు. ఆ కోవలోనే శేఖర్‌రెడ్డిని టీటీడీ ట్రస్ట్‌బోర్డులో సభ్యుడిగా వేయించాడు. మనీపవర్ అంటే ఇదేకదా!

మొత్తానికి శేఖర్‌రెడ్డి నోట్ల కట్టలతో దేశంలోనే పెనుసంచలనం సృష్టించాడు. బ్లాక్‌మనీని అరికడతానని పెద్దనోట్లు రద్దు చేసిన మోడీకే సవాల్ విసిరాడు. కట్టలకొద్దీ 2వేల నోట్లను పేర్చి ఈ దేశంలో నల్లకుబేరుల పవర్ ఏ స్థాయిలో వుందో, వారు తలచుకుంటే కరెన్సీ కట్టలు బ్యాంకుల షట్టర్లను పగలగొట్టుకుని ఎలా తమ వద్దకు చేరుతాయో మోడీకి చూపించాడు.

# కలిసుందాం...రా!

(మొదటి పేజీ తరువాయి)

పోరాటం చేసే శక్తి సామర్థ్యాలు కాంగ్రెస్‌కు లేవు. అందుకే ఆ పార్టీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ వైపు చూస్తోంది. ఏ జగన్‌ను అయితే కక్ష గట్టి జైలుకు పంపారో, అదే జగన్ సారధ్యంలో ముందుకు పోవాలని భావిస్తోంది. జగన్ నాయకత్వంలో జగన్‌తో కలిసి పని చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహం చూపిస్తున్నాయి.

వీళ్ల ఆశల్లా ఒక్కటే! వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోవడం ఖాయం. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. తాము ఎలాగూ తెలుగుదేశంతో జత కట్టలేము. వైసిపితో జత కడితే కనీసం నాలుగు స్థానాలన్నా గెలుచుకుని రాష్ట్రంలో పార్టీ ఉనికిని కాపాడుకోవచ్చు. అంతే కాదు, ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వలేమని చెప్పి బీజేపీ మోసం చేసింది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపికి ప్రత్యేకహోదా ఇస్తాం, రాష్ట్రంలో వైసిపి వస్తే ప్రత్యేకహోదా తెచ్చిన ఖ్యాతి కూడా ఆ పార్టీకి దక్కుతుంది. ఈ భావాలతోనే కాంగ్రెస్ నాయకులు వైసిపికి దగ్గర కావాలని చూస్తున్నారు. మరి జగన్ ప్రతిస్పందన ఏ విధంగా ఉంటుందో చూడాలి!

# నలుపు తెలుపైపోయింది...

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు లక్షల కోట్ల మధ్య నల్లధనం బ్యాంకులకు రాకపోవచ్చునని, బ్యాంకుకు రాని నల్లధనమంతా ప్రభుత్వందే అవుతుందని, అప్పుడు ఆ డబ్బుతో ఎన్నో ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నోట్ల రద్దు ఫలితాలను సగర్వంగా చాటుకోవచ్చని ప్రధాని మోడీ ఆశపడ్డారు. కాని, పరిస్థితి చూస్తుంటే ముదు నాలుగు లక్షల కోట్లు కాదు కదా, మూడు నాలుగు వేల కోట్లు కూడా బయట నిలబడిపోయే అవకాశం లేదు. ఇదే జరిగితే భారత చరిత్రలోనే పెద్దనోట్ల రద్దు ప్రక్రియ పెద్ద అట్టర్‌ఫ్లాప్ షో అవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థకు దాదాపు 2లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లే అవకాశముంది. కొత్త కరెన్సీ ముద్రణ, రవాణా ఖర్చులతో పాటు బ్యాంకుల్లో అధిక డిపాజిట్ల మూలంగా వడ్డీల భారం పడనుంది. అలాగే ఈ నవంబర్ 8 నుండి డిసెంబర్ 30 దాకా పెద్దనోట్ల రద్దు వల్ల సంభవించిన వ్యాపార నష్టాలను, భవిష్యత్‌లో చోటుచేసుకోబోయే నష్టాలను లెక్కలోకి తీసుకుంటే లక్షల కోట్లలోనే ఉంటుంది. వివిధ రంగాల అభివృద్ధి అయితే ఎన్నో ఏళ్లు వెనక్కిపోయినట్లే! ఆర్‌బిఐ ఇప్పటికే జిడిపి రేటును తగ్గించేసింది.

### బ్లాక్‌లోకి మళ్ళీ వైట్

నల్లధనం బయటకు తేవాలని పెద్దనోట్లు రద్దు చేసి కొత్తగా 2వేల నోట్లు విడుదల చేశారు. కాని ఈ 2వేల కొత్తనోట్లు తిరిగి బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లాయి. దాదాపు 2లక్షల కోట్ల విలువ మేర 2వేల కొత్త నోట్లను ఆర్‌బిఐ విడుదల చేస్తే అందులో లక్షకోట్లకు పైగా కమిషన్ పద్ధతి మీద బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లినట్లుగా తెలుస్తోంది. ఐటి, సిబిఐ దాడుల్లో భారీగా బయటపడుతున్న 2వేల కొత్త నోట్ల కట్టలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో అక్రమాలపై కేంద్రం అంచనా వేయలేకపోయింది. బ్యాంకులను పూర్తిగా నమ్మింది. కొత్త నోట్ల పంపిణీకి సంబంధించి ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలంటూ హెచ్చరికలు లేకపోవడంతో కొత్త నోట్లను బ్లాక్‌లోకి పంపించడంలో బ్యాంకులు ప్రధాన పాత్ర పోషించాయి.

### బ్లాక్ ఎటుపోయినట్లు?

దేశంలో వున్న పెద్దనోట్లన్నీ బ్యాంకుల్లో జమపడితే మరి దేశంలో నల్లధనం ఎటుపోయినట్లు? అసలు నల్లధనమే లేదా? అన్న ప్రశ్నలు రాకమానవు. దేశంలో నల్లధనం లేకుండాపోలేదు. అయితే దానిని బ్యాంకుల్లో జమ చేయకుండా తగులబెట్టే స్థాయిలో లేదు. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి ఈ దేశంలో చాలా అవకాశాలున్నాయి. ప్రధాని పెద్దనోట్ల రద్దు ప్రకటించాక, ఈ దేశంలో బంగారం అమ్మకాలు, కొనుగోళ్లు భారీ ఎత్తున జరిగాయి. చాలా నల్లధనం ఇక్కడ మారిపోయింది. అలాగే స్థిరాస్థి లావాదేవీలు జరిగిపోయాయి. ఇంకొంత నల్లధనం ఇక్కడ అడ్జస్ట్ అయ్యింది. నోట్ల రద్దుకు ముందు 27కోట్ల జన్‌ధన్ ఖాతాలలో గట్టిగా వెయ్యికోట్లు కూడా లేవు. కాని నోట్ల రద్దు తర్వాత ఈ ఖాతాలలో ఇప్పటికే 75వేల కోట్లు చేరాయి. ఇదంతా కూడా బ్లాక్‌మనీనే! ఇక దేశంలో సాలీనా వెయ్యిమందిని తీసుకుంటే వీరిలో ఒక్కరికి బ్లాక్‌మనీ వున్నా ఎక్కువ. ఈ ఒక్కరి వద్ద వున్న నల్లధనాన్ని మిగిలిన 999మందితో అడ్జస్ట్ చేసుకోవడం పెద్ద సమస్య కాదు. అంతెందుకు నోట్ల రద్దుకు ముందు దేశంలో వున్న అన్ని బ్యాంకు అకౌంట్లలో నగదు నిల్వను చూడండి, నోట్ల రద్దు తర్వాత బ్యాంకు బ్యాలెన్స్‌ను చూడమనండి. అంతకుముందు కనీస నగదును ఉంచని ఖాతాల్లో కూడా ఇప్పుడు వేలు, లక్షల రూపాయలు ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ దేశంలో పేదోళ్లు 90శాతం, ధనికులు 10శాతం మాత్రమే కాబట్టి, ఈ రెండు వర్గాల వారి మధ్య అడ్జస్ట్‌మెంట్ కుదిరితే ఈ దేశంలో బ్లాక్‌మనీని వెదికి పట్టడం కష్టమే! ఇప్పుడు అదే జరిగినట్లుగా కనపడుతోంది.

### ప్రభుత్వం కింకర్తవ్యం

ప్రధాని ఆశించిన విధంగా నల్లధనం నిలబడకపోతే వెంటనే ఆర్థిక వ్యవస్థ దిద్దుబాటు చర్యలు తప్పవు. అవినీతి, నల్లధనం నిరోధానికి నగదు రహిత లావాదేవీలు జరపాలన్నా ఇప్పుడిప్పుడే పూర్తి స్థాయిలో సాధ్యం కాదు. కేవలం డిజిటల్, ఆన్‌లైన్ లావాదేవీలు నడిపితే కార్పొరేట్ వ్యవస్థలు బలపడి దేశంలో సన్న, మధ్య తరగతి వ్యాపారులు దిక్కులేనివాళ్లైపోతారు. కేవలం రిలయన్స్, బిగ్‌బజార్ వంటి సంస్థలు మాత్రమే బాగుపడతాయి. అందుకని జనవరి నుండైనా విత్‌డ్రా నగదు పెంచక తప్పదు. ఒక స్థాయి నగదు లావాదేవీల వరకు చెక్, కార్డులను ప్రవేశపెట్టి, చిన్నచిన్న లావాదేవీలకు కరెన్సీని అనుమతించక తప్పదు.

### రియాల్టీకి ఊతమివ్వాల్సిందే!

దేశంలో రియల్‌ఎస్టేట్ రంగం పుంజుకున్నాకే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడింది. ఉపాధి అవకాశాలతో పాటు, దాని అనుబంధ వ్యాపార రంగాలు వృద్ధి చెందాయి. ఈరోజు దేశంలో వ్యవసాయ రంగం తర్వాత ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్నది రియల్‌ఎస్టేట్ రంగమే! ఇది దెబ్బతింటే దేశ ఆర్థిక వ్యవస్థే ప్రమాదంలో పడుతుంది. పెద్దనోట్ల రద్దు వల్ల దేశంలో మొదట కుప్పకూలింది రియల్ ఎస్టేటే! తిరిగి రియల్‌ఎస్టేట్ పట్టాలెక్కకపోతే దేశ ఆర్థిక వ్యవస్థకే అది తీరని నష్టం కలిగిస్తుంది. వెనువెంటనే రియల్ ఎస్టేట్ రంగం కోలుకునే దిశగా కేంద్రం చర్యలు చేపట్టక తప్పదు.

### బ్లాక్‌పై అంచనా తప్పింది

దేశంలో నల్లధనాన్ని రెండురకాలుగా చెప్పుకోవచ్చు. ఒకటి అతిగా సంపాదించి, సంపాదించిన సొమ్ముకు పన్ను కట్టకుండా దాచుకునేది. రాజకీయ నాయకులు, బడా వ్యాపారులు, కాంట్రాక్టర్లు ఇలాంటి డబ్బును కలిగి వుంటారు. కాని ఈ దేశంలో ఎక్కువ మంది రైతులు, చిన్న వ్యాపారులు, కూలీలు వున్నారు. వీరంతా కూడా నెలవారీ సంపాదనలో ఎంతోకొంత కూడబెడు తుంటారు. తమ అవసరాలను త్యాగం చేసి బిడ్డల చదువులు, పెళ్లిళ్ళు, ఆసుపత్రుల ఖర్చులకని పొదుపు చేస్తుంటారు. అలా పొదుపు చేసిన డబ్బును బ్యాంకుల్లో వేయకుండా ప్రైవేట్‌గా వడ్డీలకివ్వడమో, లేదా స్థలాలు, పొలాల రూపంలో దాచుకోవడమో చేస్తుంటారు. కుటుంబాలకు ఒక నెల ఆదాయం లేనప్పుడు కూడా ఈ పొదుపే వారిని ఆదుకుంటుంది. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభాలు తలెత్తినప్పుడు కూడా భారతదేశం ఒడిదుడుకులకు లోనుకాకుండా నిలబడిందంటే కారణం భారతీయులలో వున్న పొదుపు మంత్రశక్తి వల్లే!

మొత్తానికి కేంద్రం వూహించిన దానికి భిన్నంగా నోట్ల ప్రయాణం సాగింది. బ్యాంకుల్లో జమపడ్డ భారీ నగదుపై ఆదాయ పన్ను తప్పితే కేంద్రానికి ఇంకే రూపంలోనూ దీని మూలంగా ఆదాయం ఉండేటట్లు లేదు. దేశీయ మార్కెట్‌ను ఫ్రీ చేయకుండా కేంద్రం ఇలాగే బిగించి పడితే ఆర్థిక ఆటుపోట్లు తప్పవని నిపుణుల అంచనా!

## పేదబ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

శ్రీ తిప్పరాజు వెంకటసుబ్బయ్య సత్రం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ప్రతిభ అర్హత కల్గిన పేద బ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు విద్యాప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు టివిఎస్ కళ్యాణసదన్ మేనేజింగ్ ట్రస్టీ డా॥ పిఎస్‌ఆర్‌కె మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హతగల పేద బ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు ధృవీకరణ పత్రాల జెరాక్స్ కాపీలు జత చేసి ఈ నెల 30వ తేదీలోగా తిప్పరాజు వెంకటసుబ్బయ్య సత్రం కార్యాలయంలో స్వయంగా గాని, పోస్టు ద్వారాగాని పంపుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారాలు సత్రం కార్యాలయంలో ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు అందజేస్తారని తెలిపారు.

## ఎస్పీ విశాల్‌గున్నీకి సూక్ష్మ అక్షరాలతో శుభాకాంక్షలు




ఇటీవల నెల్లూరులో జరిగిన భారీ బంగారు ఆభరణాల చోరీ కేసులో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి కేవలం వారం రోజుల్లో నిందితులను పట్టుకుని బంగారాన్ని రికవరీ చేసిన నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీకి శుభాకాంక్షలు తెలియ జేస్తూ సూక్ష్మ కళాకారుడు డా॥ షేక్‌ముసవ్విర్ విశాల్‌గున్నీ పేరుతో సూక్ష్మ అక్షరాలను తయారుచేసి తన కంటి రెప్పలో వుంచి అందరిని అబ్బురపరిచారు. ఈ సూక్ష్మ నమూన ఎత్తు, వెడల్పు 1 సెం.మీ ఉందని ఈ సందర్భంగా ముసవ్విర్ తెలిపారు.



## జి.వి.కె కుటుంబానికి వియ్యంకులవుతున్న అక్కినేని కుటుంబం

కీ॥శే॥ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీమతి అన్నపూర్ణమ్మల మనుమడు, అక్కినేని నాగార్జున - అమలల కుమారుడు **చి॥ అఖిల్** నిశ్చితార్థం జి.వి.కృష్ణారెడ్డి - శ్రీమతి ఇందిరమ్మల మనుమరాలు, దివంగత సోంభూపాల్ - శ్రీమతి శాలినీ భూపాల్‌ల కుమార్తె **చి॥ల॥సౌ॥ శ్రేయ**తో డిసెంబర్ 9న హైదరాబాద్‌లోని జి.వి.కె.రెడ్డి స్వగృహంలో జరిగింది. సినీ, రాజకీయ, పారిశ్రామిక రంగాలకు చెందిన అనేక మంది ఈ శుభవేడుకలో పాల్గొని కాబోయే నవజంట **శ్రేయ-అఖిల్** లను ఆశీర్వదించారు. వీరి వివాహం త్వరలో రోమ్ నగరంలో జరుగనుంది.

### నల్లధనం పేరుతో...

# సామాన్యులపై దండయాత్ర

**- పనబాక కృష్ణయ్య విమర్శ**



బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు నల్లధనం పేరుతో చేసిన పెద్దనోట్ల రద్దు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనంగా మారిందని, తద్వారా సామాన్యులు, రైతులు, కూలీలు, ఫించనుదారులపై దండయాత్ర చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య అన్నారు. బుధవారం కోటలోని సిండికేట్‌బ్యాంక్ వద్ద నగదు కోసం ప్రజలు పడుతున్న పాట్లుపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వృద్ధులు, మహిళలు బ్యాంకులు, ఏటిఎంల వద్ద రాత్రిళ్లు, పగలు పడిగాపులు కాస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం బ్యాంకులకు డబ్బులు అందడం లేదని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. ఈ నోట్లు రద్దు నిర్ణయం వెనుక పెద్ద కుంభకోణం దాగివుందన్నారు. బడా నల్లకుబేరులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సుమారు 8లక్షల కోట్లు రూపాయలను ఎగనామం పెట్టారన్నారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు సామాన్య ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. బ్యాంకుకు నామం పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోగా ఆ లోటును పూడ్చుడానికి పేదల డబ్బులను నల్లధనం పేరుతో బ్యాంకుల్లో జమ చేస్తూ నగదు రహితం చేస్తామంటూ కొత్త పల్లవిని పాడుతున్నారన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు జహంగీర్, గూడూరు డివిజన్ సెక్రటరీ అన్వర్‌బాషా, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం అశోక్‌కుమార్, మీజూరు మల్లిఖార్జున్, పాల మల్లిఖార్జున్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# హైందవ ధర్మాన్ని కాపాడుకుందాం

**- విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీ శంకర జయేంద్ర సరస్వతి స్వామి**




భారతదేశ హైందవ ధర్మం, సంస్కృతిని కాపాడుకుందామని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర జయేంద్ర సరస్వతిస్వామి పేర్కొన్నారు. సోమవారం రాత్రి శ్రీ శంకర విజయేంద్రసరస్వతి స్వామితో కలిసి నెల్లూరురూరల్ మండలం కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. కన్వెన్షన్ సెంటర్ అధినేత, ప్రముఖ దాత, వితరణశీలి, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి -ప్రశాంతి దంపతులు స్వామివారికి పాదాభివందనం చేశారు. అనంతరం పుష్పపాదుక పూజను వేదపండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ శంకరాచార్యులు స్థాపించిన కంచి కామకోటి పీఠం తరఫున అనేక విద్యాసంస్థలు, దేవాలయాలను నెలకొల్పామన్నారు. ఆసుపత్రులను నిర్వహిస్తూ పేదలకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. హిమాలయాల్లోని మానస సరోవరంలో గల కైలాసపర్వతంలో స్వామి శంకరాచార్యుని విగ్రహాన్ని ఆవిష్కరించారని తెలిపారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాఠశాలను, వైద్యశాలను స్థాపించి ఉచిత విద్య, వైద్యం అందించడాన్ని అభినందించారు. ఆదాల దంపతులు స్వామివార్లకు వస్త్రాలను సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, హిందూధర్మ ప్రచార మండలి అధ్యక్షులు సి.వి. సుబ్రహ్మణ్యం, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# సమీక్షలతో టైం వేస్ట్!

**- మంత్రికి కోటంరెడ్డి సూచన**



రివ్యూ మీటింగ్‌లతో పెద్ద టైం వేస్టని, దీనిబదులు అధికారులను స్వేచ్ఛగా వదిలేస్తే వాళ్లు ప్రజల సమస్యలను పరిష్కరించగలరని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంత్రి నారాయణకు చురకలంటించారు. తఫాన్ ప్రభావిత ప్రాంతాలైన నెల్లూరులోని నక్కలగుంట, గంగోత్రినగర్, కొండాయపాళెంలలో ఆయన 13వ తేదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులకు సహాయ చర్యల కోసం అధికారులకు ఫోన్ చేయగా, తాము మంత్రిగారి రివ్యూ మీటింగ్‌లో వున్నామని సమాధానమిచ్చారు. దీంతో కోటంరెడ్డికి మండింది. వెంటనే ఆయన జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌అహ్మద్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. తాను మంత్రికి ఫోన్ చేస్తే ఎత్తుకోవడం లేదని, రివ్యూ మీటింగ్‌ల పేరుతో అధికారులను గంటలపాటు కూర్చోబెట్టుకుంటే ఇక ప్రజల సమస్యలు ఎవరు తీర్చాలని అసహనం వ్యక్తం చేశారు. రివ్యూ మీటింగ్‌లతో కంఠశోష తప్ప ఎలాంటి ఉపయోగం ఉండదని, మంత్రికి ఇది తన మాటగా చెప్పాలని కూడా ఆయన జేసీకి సూచించారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com